నమ్మలేని నిజాలు

పాప చింతన
పరమత సహనం
ఉంటేనె మతం
నగ్న అందాల
విచిత్ర బాడీ ఆర్ట్స
కళా వస్త్రాలు
వేదిక చేప
వర్షాలకు చికెను
మెరగం విందు

ముష్కర దాడి
మతఛాందస్స క్రీడ
దుఃఖం లో ప్రజ
కీర్తికి పీఠం
అవార్డుల ఇంధనం
జ్ఞాన తిమిరం



- రేడియమ్
సెల్: 9291527757


# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com


ప్రజాక్షేమం ముఖ్యమని
చేస్తె బాగు పరిపాలన !
మాట మాని చేయవచ్చు
ముసిముసిగ మురిపాలనా !
దప్పికేస్తె కావాలోయ్
నిండ నీళ్ల కడవ !
ఇవ్వకుంటె మునిగిపోవు
నీవెక్కిన పడవ !

శ్రీనిజాలు



- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

హైదరాబాద్ గురువారం 12-6-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-50 001. సంపుటి :31 సంచిక:239 పేజీలు:6 వెల: రూ.1/-

### పాత మంత్రుల శాఖలలో మార్పులుండవ్..

# నా వద్ద శాఖలనే కొత్త మంత్రులకు కేటాయిస్తా



కేసీఆర్ తో సహా ఆ కుటుంబం అంతా నా శత్రువులే

తాను కాంగ్రెస్ లోఉండగా వారందరికి హస్తం పార్టీలోకి నో ఎంట్రీ

తెలంగాణకు అన్యాయం చేస్తున్నది కిషన్ రెడ్డే

కెటిఆర్ సూచనతోనే మెట్రోకు కిషన్ అడ్డుపుల్ల

-ఢిల్లీ లో మీడియాతో చిట్ చాట్‌లో సీఎం రేవంత్ రెడ్డి

న్యూఢిల్లీ, జూన్ 11:కొత్త మంత్రులకు తన వద్ద ఉన్న శాఖలనే కేటాయించనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు.. పాత మంత్రుల శాఖల్లో ఎటువంటి మార్పులు ఉండవని ఆయన సంకేతాలు ఇచ్చారు.. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన ఇవాళ తన పర్యటన ముగించుకుని హైదరాబాద్‌కు బయల్దేరే ముందు ఢిల్లీలో మీడియాతో చిట్‌చాట్ నిర్వహించి పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో జరిగిన మంత్రివర్గ విస్తరణపై ఢిల్లీలో ఎలాంటి చర్చ జరగలేదని, కొత్త మంత్రులకు శాఖల కేటాయింపుల అంశం ప్రస్తావనకు రాలేదన్నారు. హైదరాబాద్‌కు వచ్చాక అందరితో సంప్రదించి శాఖలు నిర్ణయిస్తామన్నారు. తాను ఢిల్లీకి వచ్చింది కర్ణాటకలో కులగణన అంశంపై అధిష్టానంతో చర్చించేందుకేనని చెప్పారు. తెలంగాణలో కులగణన నిర్వహణ అంశాన్ని పార్టీ పెద్దలతో చర్చించినట్లు స్పష్టం చేశారు. అయితే పాత మంత్రుల శాఖలను మార్పు చేసే అవకాశం లేదన్నారు. తన వద్ద ఉన్న హోం, మున్సిపల్, క్రీడలు, విద్య తో పాటు 11 శాఖలలోని కొన్నింటికి కొత్తగా బాధ్యతలు స్వీకరించిన వారికి కేటాయిస్తామని పేర్కొన్నారు.


### బీఆర్ఎస్ నేతలకు కాంగ్రెస్‌లో ఎంట్రీ లేదు..

కేసీఆర్ కుటుంబ సభ్యులే తెలంగాణకు శత్రువులు అని సీఎం రేవంత్ రెడ్డి అని స్పష్టం చేశారు. తానున్నంత వరకు కాంగ్రెస్‌లోకి కేసీఆర్ కుటుంబానికి ఎంట్రీ లేదని హాట్ కామెంట్స్ చేశారు. అసెంబ్లీ రౌడీ సినిమాలో బాషా గ్యాంగ్ మాదిరిగా బీఆర్ఎస్ నేతల పంచాయతీ ఉందని విమర్శించారు. మీడియా దృష్టిని తమవైపు తిప్పుకునేందుకు బీఆర్ఎస్ నేతలు డ్రామాలు చేస్తున్నారని ఆరోపించారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, కిషన్‌రెడ్డి ఒక్కటేనన్నారు. 2-3 రోజుల్లో కాళేశ్వరంపై మీడియాతో మాట్లాడుతానని, ఈ ప్రాజెక్టుకు సంబంధించి కీలక డాక్యుమెంట్లు బయటపెడతానని చెప్పారు.

### తెలంగాణకు అన్యాయం చేస్తున్నది కిషన్ రెడ్డి

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలంగాణకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని, ప్రాజెక్టులను అడ్డుకుంటున్నదని ఆయనేనని ఆరోపించారు రేవంత్ రెడ్డి. రాష్ట్రానికి ఆయన ఒక్క ప్రాజెక్టు కూడా తీసుకురాలేదని, కేబినెట్ మంత్రిగా తెలంగాణ అంశాలపై తనతో కిషన్‌రెడ్డి ఒక్క రివ్యూ కూడా జరపలేదన్నారు. మెట్రో విస్తరణ కేటీఆర్‌కు ఇష్టం లేదని అంటూ దీని కారణంగానే కిషన్‌రెడ్డి అడ్డుకుంటున్నారని ధ్వజమెత్తారు. కేంద్రమంత్రిగా కిషన్‌రెడ్డి ఫెయిల్ అయ్యారని విమర్శించారు.

# సింగర్ మంగ్లీ బర్త్‌డే పార్టీలో డ్రగ్స్ కలకలం.!




చేవెళ్ల , జూన్ 11: ప్రముఖ టాలీవుడ్ సింగర్ మంగ్లీ పుట్టినరోజు వేడుకలు వివాదాలకు దారితీశాయి. చేవెళ్లలోని త్రిపుర రిసార్టులో మంగ్లీ బర్త్‌డే పార్టీ సందర్భంగా నిర్వహించిన వేడుకల్లో పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించగా.. ఈ దాడుల్లో భారీగా గంజాయి, విదేశీ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ పార్టీకి హాజరైన పలువురికి నిర్వహించిన వైద్య ఎలో మంగ్లీ పుట్టినరోజు వేడుకలు మంగళవారం రాత్రి ఘనంగా జరిగాయి. ఈ పార్టీకి సినీ, రాజకీయ ప్రముఖులతో పాటు పలువురు యువత పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అయితే పార్టీలో మాదకద్రవ్యాల వినియోగం జరుగుతుందన్న సమాచారంతో పోలీసులు రిసార్టుపై దాడులు చేశారు.

అయితే ఈ సోదాల్లో పెద్ద మొత్తంలో గంజాయి, వివిధ రకాల విదేశీ మద్యం సీసాలు లభ్యమయ్యాయి. పార్టీలో ఉన్న పలువురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు, వారికి డ్రగ్ టెస్టులు నిర్వహించారు. ఈ పరీక్షల్లో కొన్ని సాంపుల్స్‌కు డ్రగ్స్ పాజిటివ్‌గా నిర్ధారణ అయినట్లు తెలిసింది. డ్రగ్స్ వినియోగించిన వారిలో కొందరు ప్రముఖుల పిల్లలు కూడా ఉన్నట్లు సమాచారం.

ఈ ఘటనతో సినీ వర్గాల్లో, ముఖ్యంగా యువతలో మాదకద్రవ్యాల వాడకంపై మరోసారి ఆందోళన వ్యక్తమవుతోంది. కేసు నమోదు చేసుకున్న



పోలీసులు, దీనిపై లోతైన దర్యాప్తు చేస్తున్నారు. పార్టీ నిర్వాహకుల పాత్రపైనా పోలీసులు దృష్టి సారించారు. డ్రగ్స్ సరఫరా వెనుక ఉన్న అసలు సూత్రధారులను పట్టుకునేందుకు దర్యాప్తును ముమ్మరం చేశారు. ఈ ఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

# ఉగ్రవాదులకు పాకిస్థాన్ సురక్షితం.. అందుకే బిన్ లాడెన్..!

### -విదేశాంగ మంత్రి జైశంకర్

న్యూఢిల్లీ, జూన్ 11: భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ బ్రస్సెల్స్ వేదికగా దాయాది పాకిస్థాన్ పై విమర్శలు చేశారు. పాకిస్థాన్.. భారత్‌కు వ్యతిరేకంగా ఉగ్రవాదాన్ని పెంచిపోషిస్తోందని ఆరోపించారు. భారత్-పాకిస్థాన్ దేశాల మధ్య సరిహద్దు సమస్య కంటే ఉగ్రవాదమే పెద్ద సమస్య అని ఆయన చెప్పారు.

యూరోపియన్ యూనియన్ నాయకులను కలిసేందుకు బ్రస్సెల్స్ వెళ్లిన మంత్రి జైశంకర్ అక్కడి మీడియాతో మాట్లాడారు. భారత్- ఈయూ బంధం భవిష్యత్తులో మరింత బలపడుతుందని తాను ఆశిస్తున్నానని అన్నారు. చర్చల ద్వారా ఈయూతో ఫ్రీ ట్రేడ్ ఒప్పందం చేసుకునేందుకు భారత్ సిద్ధంగా ఉందని తెలిపారు.

పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ ఆపరేషన్ సింధూర్ ద్వారా పాకిస్థాన్‌పై దాడికి పాల్పడటాన్ని అప్పట్లో అంతర్జాతీయ మీడియా తప్పుపట్టింది. ఈ అంశంపై కూడా జైశంకర్ స్పందించారు. భారత్-పాకిస్థాన్ మధ్య తాజా సంఘర్షణలకు కారణం సరిహద్దు సమస్య కాదని, ఉగ్రవాద సమస్య అని అన్నారు. పాకిస్థాన్ ఉగ్రవాదులకు అడ్డాగా మారిందని విమర్శించారు.

పాకిస్థాన్ ఉగ్రవాదులకు సురక్షిత ప్రదేశం కాబట్టే అక్కడి మిలిటరీ ఏరియాల్లో ఏళ్లుగా ఉగ్రవాదులు ఆశ్రయం పొందుతున్నారని జైశంకర్ ఆరోపించారు. ఆ దేశం ఉగ్రవాదులకు సురక్షితం కాకపోతే ఒసామా బిన్ లాడెన్ అక్కడే ఎందుకు దాక్కుంటాడని ప్రశ్నించారు.

అంతర్జాతీయ మీడియా, సమాజం ఈ విషయాన్ని అర్థం చేసుకోవాలని తాను ఆశిస్తున్నానని అన్నారు.

# 50 నిమిషాల పాటు కొనసాగిన కేసీఆర్ విచారణ



హైదరాబాద్, జూన్ 11: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ విచారణ ముగిసింది. కాళేశ్వరం కమిషన్ చైర్మన్ జస్టిస్ పీసీ ఘోష్.. కేసీఆర్‌ను 50 నిమిషాల పాటు విచారించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన అంశాలపై కమిషన్‌కు కేసీఆర్ నివేదిక ఇచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టు పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను కూడా కమిషన్‌కు కేసీఆర్ అందజేశారు. కమిషన్ అడిగిన ప్రతి ప్రశ్నకు ఆధారాలతో సహా నివేదిక సమర్పించారు కేసీఆర్.

విచారణ అనంతరం బయటకు వచ్చిన కేసీఆర్ నేరుగా తన కారులో ఎక్కి కూర్చున్నారు.

అనంతరం అక్కడున్న పార్టీ శ్రేణులకు కేసీఆర్ అభివాదం చేశారు. కేసీఆర్ కారులోనే హరీశ్‌రావు కూడా వెళ్లారు. ఇక కేసీఆర్ బయటకు రాగానే జై కేసీఆర్.. జై తెలంగాణ అని పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు నినాదాలు చేశారు.

ఇక ఉదయం 9.30 గంటల సమయంలో ఎర్రవల్లి నుంచి కేసీఆర్ హైదరాబాద్‌కు బయల్దేరారు. సరిగ్గా ఉదయం 11 గంటల సమయంలో హైదరాబాద్‌లోని బీఆర్‌కే భవన్‌కు కేసీఆర్ చేరుకున్నారు. కేసీఆర్‌తో పాటు ఎమ్మెల్సీ మధుసూదనాచారి, ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్ రెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, పద్మారావు గౌడ్, బండారి లక్ష్మారెడ్డి, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, మహమూద్ అలీ బీఆర్‌కే భవన్‌లోకి వెళ్లారు.

# దేశంలో 7,121కి పెరిగిన క్రియాశీల కేసులు.. 24 గంటల్లో ఆరుగురు మృతి

న్యూ ఢిల్లీ జూన్ 11 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );దేశంలో మరోసారి కరోనా వైరస్ కలకలం సృష్టిస్తోంది. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో కొత్త కేసులు నమోదవుతున్నాయి. ఇక నిన్న ఒక్కరోజే 300కిపైగా కొత్త కేసులు వెలుగు చూశాయి. దీంతో దేశంలో క్రియాశీల కేసుల సంఖ్య 7 వేలు దాటింది.కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ డేటా ప్రకారం మంగళవారం ఉదయం 8 గంటల నుంచి బుధవారం ఉదయం 8 గంటల వరకూ 306 మందికి పాజిటివ్‌గా తేలింది. కేరళలో అత్యధికంగా నిన్న ఒక్కరోజే 170 కేసులు బయటపడ్డాయి. ఆ తర్వాత గుజరాత్‌లో 114 కేసులు వెలుగు చూశాయి. తాజా కేసులతో కలిపి దేశంలో మొత్తం యాక్టివ్ కేసుల సంఖ్య 7,121కు పెరిగింది. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకూ 8,573 మంది మహమ్మారిబారి నుంచి కోలుకున్నారు. 24 గంటల్లో ఆరు మరణాలు సంభవించాయి. మహారాష్ట్రలో ఒకరు, కర్ణాటకలో ఇద్దరు, కేరళలో ముగ్గురు కొవిడ్ కారణంగా ప్రాణాలు కోల్పోయారు. దీంతో ఈ ఏడాది ఇప్పటి వరకూ కరోనా కారణంగా మరణించిన వారి సంఖ్య 74కి ఎగబాకింది.

రాష్ట్రాల వారీగా కొవిడ్ కేసులు ఇలా..

కేరళ రాష్ట్రంలో అత్యధికంగా 2,223 కేసులు యాక్టివ్‌గా ఉన్నాయి. ఆ తర్వాత గుజరాత్ (1,223), ఢిల్లీ (757), పశ్చిమ బెంగాల్ (747), మహారాష్ట్ర (615), కర్ణాటక (459), ఉత్తరప్రదేశ్ (229), తమిళనాడు (204), రాజస్థాన్ (138), హర్యాణా (125), ఆంధ్రప్రదేశ్ (72), మధ్యప్రదేశ్ (65), ఛత్తీస్‌గఢ్ (48), బీహార్ (47), ఒడిశా (41), సిక్కిం (33), పంజాబ్ (33), తెలంగాణ (11), జార్ఖండ్ (10), పుదుచ్చేరి (10), జమ్ము కశ్మీర్‌లో తొమ్మిది, అస్సాం, గోవా రాష్ట్రాల్లో ఆరు చొప్పున, ఛండీగఢ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో మూడు చొప్పున, హిమాచల్ ప్రదేశ్‌లో రెండు కేసులు, మణిపూర్, త్రిపుర రాష్ట్రాల్లో ఒక్కో కేసు యాక్టివ్‌గా ఉంది.

# చండీ హోమంలో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్



మెదక్, జూన్ 11: హుస్నాబాద్ శ్రీ రేణుకా ఎల్లమ్మ జాతర ముగింపు కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఆలయంలో చండీ హోమం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అంతకుముందు ఎల్లమ్మ జాతర ఉత్సవాల ముగింపులో భాగంగా అమ్మవారికి కట్టిన బాసింగాలను స్థానిక గౌడ కులస్తుల సమక్షంలో ఈవో కిషన్ రావు ఆధ్వర్యంలో ఆలయంలో సమర్పించారు.

జాతర ముగింపు బుధవారం కావడంతో భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో తరలిరావడం కనిపించింది. భక్తులు అమ్మవారికి పట్నం వేసి ఒడిబియ్యం, చీరసారెలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అందరినీ సురక్షితంగా కాపాడాలంటూ అమ్మవారిని వేడుకున్నారు.ఆలయ ప్రాంగణంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ దంపతులు చండీ హోమం కార్యక్రమంలో పాల్గొన్నారు. హుస్నాబాద్, కొత్తకొండ, భద్రకాళి దేవస్థానంకు సంబంధించిన అర్చకులు ఈ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు.

# మంత్రి వాకిటి శ్రీహరిని కలిసిన జిల్లా కలెక్టర్



మహబూబ్‌నగర్, జూన్ 11:రాష్ట్ర మంత్రి, మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి ని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

డా.వాకిటి శ్రీహరి మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం గత రాత్రి మక్తల్ కు చేరుకున్నారు. అయితే ఇవాళ మక్తల్ పట్టణంలోని మంత్రి నివాసంలో ఆయనను జిల్లా కలెక్టర్ కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు.

ఈ సందర్భంగా పలు అంశాలపై కలెక్టర్ మంత్రితో మాట్లాడారు.

# మహాకవి సినారె కళాపీఠం నిర్వహణలో ఉత్తమ డ్రైవర్లకు సేవా పురస్కారాల ప్రదానం



పురస్కార గ్రహీతలతో అతిథులు..

మహాకవి సినారె కళాపీఠం ఆధ్వర్యంలో 2025 సంవత్సరానికి సికింద్రాబాద్ రీజన్ పరిధిలోని ఉత్తమ డ్రైవర్లకు రవీంద్రభారతి సమావేశ మందిరంలో సేవా పురస్కార ప్రదాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి మాజీ మంత్రి ప్రముఖ చలనచిత్ర నటులు బాబు మోహన్ ముఖ్య అతిథిగా పాల్గొని పురస్కారాల ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ మహాకవి సినారెతో ఉన్న అనుబంధాన్ని పంచుకున్నారు. నన్ను హీరోగా చేస్తూ సినారె రాసిన పాటలను గుర్తు చేసుకున్నారు. అలాంటి ఓ మహానుభావుని పేరిట సంస్థను స్థాపించి సాహిత్య కళా సేవా రంగంలో ఉత్తమ సేవలందిస్తున్న సంస్థ అధ్యక్షుడు మల్లెకేడి రాములు అభినందనీయుడన్నారు.

సినారె దగ్గర డ్రైవర్‌గా పనిచేసిన వ్యక్తి ఇంతటి భక్తిభావం పెంచుకొని కార్యక్రమాలు చేయడం గొప్ప విషయమన్నారు. తాను కార్మిక శాఖామంత్రిగా ఉన్నపుడు కార్మికుల కోసం తీసుకు వచ్చిన సంస్కరణలను జ్ఞప్తికి తెచ్చుకున్నారు. ప్రముఖ కవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అడిషనల్ డిసిపి రాందాసు తేజావత్, ప్రముఖ సంఘ సేవకులు దాసరి దయానంద్ రెడ్డి, సికింద్రాబాద్, కూకట్‌పల్లి జోన్ల డిప్యూటీ రీజనల్ మేనేజర్లు డి.ఎన్. పవిత్ర, అపర్ణా కళ్యాణి, డిపో మేనేజర్లు డి. సుధాకర్‌రావు, కవిత, శ్రీధర్, టి.ఎస్.రావు, నర్సయ్య, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో 11 మంది ఉత్తమ డ్రైవర్లు పురస్కారాలు అందుకున్నారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు మల్లెకేడి రాములు ప్రధాన కార్యదర్శి సుమిత్ర, కార్యవర్గ సభ్యుడు సాయికృష్ణ పాల్గొన్నారు. డా॥ పోరెడ్డి రంగయ్య సమన్వయకర్తగా వ్యవహరించారు.

# దేశమంతా డబుల్ ఇంజన్ సర్కార్ ను కోరుకుంటున్నది బండి సంజయ్

తిరుపతి, జూన్ 11: దేశమంతా ప్రధాని మోడీ నేతృత్వంలోని డబుల్ ఇంజిన్ సర్కార్‌ను కోరుకుంటోందని, ఈ డబుల్ ఇంజిన్ సర్కార్ వల్లే ఏపీలో అభివృద్ధి మెరుపు వేగంతో జరుగుతోందని బండి సంజయ్ అన్నారు. తిరుపతిలో కేంద్రమంత్రి బండి ఇవాళ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ మోదీ 11 ఏళ్ల పాలన విశేషాలను వివరించారు.


ఇప్పటికే ఏపీకి 8 కేంద్రీయ విద్యాలయాలను కేంద్రం ఇచ్చిందని, రాష్ట్రంలో ఇప్పటి వరకు 4,741 కి.మీ హైవేలను నిర్మించామని వెల్లడించారు. పలు ఎయిర్‌పోర్టు లను మరింత ఆధునీకరిస్తున్నామని పేర్కొన్నారు. అలాగే రైల్వే బడ్జెట్‌లో ఏపీకి పెద్దపీట వేశామని, అమృత్ మహోత్సవంలో భాగంగా.. రాష్ట్రంలోని అనేక రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఎన్డీయే ప్రభుత్వ హయాంలోనే ఏపీకి 24 లక్షల ఇళ్లను మంజూరు చేశామని కేంద్ర మంత్రి బండి సంజయ్ వెల్లడించారు.

ఆహ్వానము

116

భవానీ సాహిత్య వేదిక
కరీంనగర్ - తెలంగాణ

డా. వైరాగ్యం ప్రభాకర్ సంపాదకత్వంలో వెలువడిన
నాన్నకు... ప్రేమతో.. కవితా సంకలనం
పుస్తకావిష్కరణ సభ



తేది : 15.06.2025 ఆదివారం ఉ॥ 10.00 గంటలకు
వేదిక : వాగీశ్వరి డిగ్రీ కళాశాల, గీతాభవన్ ప్రక్కన, కరీంనగర్.

సభాధ్యక్షులు :
డా. వైరాగ్యం ప్రభాకర్ గారు
అధ్యక్షులు, భవానీ సాహిత్య వేదిక, కరీంనగర్.
ముఖ్య అతిథి & పుస్తక ఆవిష్కర్త :
శ్రీ ఎన్వీ. రఘువీర్ ప్రతాప్ గారు
తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కార గ్రహీత, అధ్యక్షులు-ధర్మకేతనం సాహిత్య కళాపీఠం.
విశిష్ట అతిథులు :
శ్రీ దాస్యం సేనాధిపతి గారు, ప్రముఖ కవి, రచయిత, విమర్శకులు
అమృతలత జీవన సాఫల్య పురస్కార గ్రహీత
కృషిరత్న శ్రీ బుస్స శ్రీనివాస్ గారు
అధ్యక్షులు, శ్రీరాజరాజేశ్వర క్షేత్ర ఆర్యవైశ్య వాసవి నిత్యాన్నదాన సత్రము, వేములవాడ.
ఆత్మీయ అతిథి :
శ్రీ నరహరి లక్ష్మారెడ్డి గారు
విశాంత్ర ఉపాధ్యాయులు, PRTU-TS మాజీ ప్రధాన కార్యదర్శి
సమీక్షకులు :
శ్రీ కూర చిదంబరం గారు, ప్రముఖ కవి, కథా రచయిత,
తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కార గ్రహీత
ఆహ్వానించువారు :
బొమ్మకంటి కిషన్, కవి, ఆధ్యాత్మికవేత్త
అందరూ ఆహ్వానితులే !

చురక

పాలక పార్టీల స్వంత
ప్రసార మాధ్యమాలు
బట్టలిడిసి ఊరేగితే
ప్రజలకేమి ఒరిగే మేలు
ఎదుటివాళ్ల ఎండగట్ట
ఎందుకిన్ని రోత కుతలు
పాత్రికేయ విలువలను
పాతరేసే కట్టు కథలు



-వేల్పుల నారాయణ
9440433475

నేటి కందం- నేటికి అందం

అలుపెరుగని కృషి సలుపుచు
తల తిరుగుడు స్పెయిను నుండి దార్శనికతతో
విలువలు గల స్వాతంత్ర్యము
నలరు ఫిలిప్పైన్సు బొందె నానందముతోన్ !!

(12-6-1898 ఫిలిప్పీన్స్ స్వాతంత్ర్యం పొందిన రోజు)



-రాధశ్రీ
సెల్:9494481210

ఆహ్వానం



కిన్నెర ఆర్ట్ థియేటర్స్ 48
శ్రీ త్యాగరాయగాన సభ
సంయుక్త ఆధ్వర్యంలో

సాహిత్య సవ్యసాచి, విమర్శన కళాప్రవీణ
డా॥ ద్వానా శాస్త్రి గారి
78వ జయంతి సందర్భంగా



ప్రముఖ సాహితీ వేత్త
డా॥ వోలేటి పార్వతీశంగారికి
కిన్నెర-ద్వానాశాస్త్రి స్మారక
పురస్కారం-బహూకరణ

ఆదివారం 15-6-2025, సా॥ 6 గంటలకు
కళా సుబ్బారావు కళావేదిక,
శ్రీ త్యాగరాయగాన సభ, హైదరాబాదు

ముఖ్యఅతిథి : డా॥ కె.వి.రమణ, ఐఎఎస్ (రి)
పూర్వ సలహాదారు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం
అధ్యక్షులు : శ్రీ జి. వల్లీశ్వర్, పాలకవర్గ సభ్యులు
నేషనల్ బుక్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా
విశిష్ట అతిథి : శ్రీ కళా జనార్దనమూర్తి
అధ్యక్షులు, శ్రీ త్యాగరాయగానసభ
గౌరవ అతిథులు : శ్రీ బైస దేవదాసు, నేటినిజం సంపాదకులు
శ్రీమతి శైలజామిత్ర, ప్రముఖ రచయిత్రి
ఆత్మీయ అతిథి : శ్రీ ద్వాదశి శశికాంత్, ద్వానా శాస్త్రి కుమారుడు


డా॥ ఆర్. ప్రభాకరరావు, ఐ.పి.ఎస్. (రి) అధ్యక్షులు, కిన్నెర
మద్దాళి రఘురామ్ కార్యదర్శి, కిన్నెర
శ్రీమతి కళా శారద కార్యదర్శి, శ్రీ త్యాగరాయగానసభ

# “సాహిత్య సాగరరూపం చిలకమర్తి లక్ష్మీనరసింహం”

## జూన్ 17న చిలకమర్తివారి వర్ధంతి సందర్భంగా)

**ఆయన కళాశాల స్థాయికి వెళ్లకపోయినా, సంస్కృతాంధ్ర గ్రంథాలను ఒకరితో చదివించుకుని జీర్ణించుకున్న ఘనత వారిది.**

**30వ ఏటనుంచి రేచీకటి తనను చాలా ఇబ్బంది పెట్టింది. తన కంటిచూపుకున్న అవరోధాన్ని అధికమించి జీవితాంతమూ అద్భుతమైన రచనలను ఆయన కొనసాగించారు.**



20వ శతాబ్దం ఆరంభ కాలంలో తెలుగువారిలో ఆధునిక భావాల వికాసానికి, భాషాభివృద్ధికి కృషి చేసిన మహనీయులలో చిలకమర్తిగారు ప్రముఖు లు. కవి, రచయిత, నాటకకర్త, పాత్రికేయుడు, సంఘ సంస్కరణవాది, విద్యావేత్త, దేశభక్తుడు అయిన స్వర్గీయ చిలకమర్తి లక్ష్మీనరసింహం గారు, 1867 సెప్టెంబరు 26వ తేదీన పశ్చిమగోదావరి జిల్లా ఖండవల్లి గ్రామంలో వెంకయ్య, రత్నమ్మ దంపతులకు మొదటి సంతానంగా జన్మించారు.

వీరవాసరం, నరసాపురం పట్టణాలలో ప్రాథమిక విద్యను పూర్తిచేసిన చిలకమర్తిగారు, ఆ తరువాత రాజమండ్రిలో తన విద్యను కొనసాగించి, 1889లో రాజమండ్రి ఆర్య పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయునిగా చేరారు. 1899లో హిందూ లోయర్ సెకండరీ స్కూలును స్థాపించి 9 సంవత్సరాలు విజయవంతంగా నడిపారు. తరువాత కాలంలో ఆ స్కూలు ‘వీరేశలింగం ఉన్నత పాఠశాలగా’ మార్చబడింది.

పాఠశాల విద్యాభ్యాస కాలంనాటికే అనూహ్యమైన ధారణాబలం కారణంగా, ఏకసంధాగ్రాహి అనిపించుకున్నారు ఆయన. విశేషమేమిటంటే ఆయన కళాశాల స్థాయికి వెళ్లకపోయినా, సంస్కృతాంధ్ర గ్రంథాలను ఒకరితో చదివించుకుని జీర్ణించుకున్న ఘనత వారిది. 1887వ సంవత్సరం విక్టోరియా మహారాణి జూబ్లీ పరిపాలనోత్సవాల సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ ఆయన పద్యాలు రచించారు. ఇలా చిలకమర్తివారి సారస్వత జీవనం కవిత్వ ప్రక్రియతో ప్రారంభమైనట్లు తెలుస్తోంది.

30వ ఏటనుంచి రేచీకటి తనను చాలా ఇబ్బంది పెట్టింది. తన కంటిచూపుకున్న అవరోధాన్ని అధికమించి జీవితాంతమూ అద్భుతమైన రచనలను ఆయన కొనసాగించారు.

నాటక కళపట్ల ఎంతో ఆసక్తి కలిగిన ఇమ్మానేని హనుమంతరావు నాయుడు కోరికపై చిలకమర్తివారు మొదటిసారిగా కీచకవధ నాటకాన్ని రచించారు. ఆ తరువాత ద్రౌపదీ పరిణయం, గయోపాఖ్యానం, శ్రీరామ జననం, సీతాకళ్యాణం, పారిజాతాపహరణం, నలచరిత్రం, చతుర చంద్రహాసము మొదలైన నాటకాలను రచించి ప్రసిద్ధులయ్యారు. ఇరవై రెండేళ్ల వయసులో ఆయన వ్రాసిన గయోపాఖ్యానం నాటకం అనేకమార్లు అనేక ప్రాంతాలలో ప్రదర్శించబడటమే కాదు అప్పట్లో ఆ నాటకం ప్రతులు లక్షకు పైగా అమ్ముడుపోయి నాటక చరిత్రలో ఒక సంచలనాన్ని సృష్టించింది. ఇలా ఎంతో ప్రాచుర్యాన్ని పొందిన

ఈ గయోపాఖ్యానం నాటకంలో ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులుగారు కూడా నటించి ఎంతగానో రాణించారని చెప్పుతూ వుంటారు. ఆ నాటకంలోని **‘అల్లుడారమ్మని’** అను పద్యము తెలుగువారెవరూ మరచిపోలేని పద్యంగా ఇప్పటికీ నిలిచిపోయింది.

ఆనాటి సాహిత్య పోషకులు న్యాపతి సుబ్బారావు నిర్వహించిన నవలల పోటీల కోసం **‘రామచంద్రవిజయం’** అనే నవల రాశారు చిలకమర్తివారు. బుద్ధిమంతుడైన అమలాపురం కుర్రోడి కథ ఇది. 1894 వ సంవత్సరం **‘చింతామణి’** పత్రికలో ఈ నవల ప్రచురితమై ప్రథమ బహుమతిని గెల్చుకుంది. అటు తరువాత కర్పూర మంజరి, సుధాశరచ్చంద్రము, హేమలత, కృష్ణవేణి, అహల్యాబాయి, సౌందర్యతిలక, మణిమంజరి, గణపతి మొదలైన నవలలు రాశారు.

ముఖ్యంగా గణపతి నవల ఆనాటి సమాజంలోని బ్రాహ్మణ కుటుంబాల స్థితిగతుల్ని మన కళ్లముందు వుంచుతుంది. గణపతి పాత్రను తలచుకున్నప్పుడల్లా ఎవరికివారు గిలిగింతలు తెచ్చుకుని నవ్వుకునే గుణవిశేషం కలిగిన హాస్యరచన ఇది. ప్రహసనాలు రాయడంలోనూ ఆయన గొప్ప దిట్ట. ఆయన రాసిన ‘గయ్యాళి గంగమ్మ’ ప్రహసనం ఎన్నో జీవితాలకు ప్రతిబింబంగా నిలుస్తోంది. అందులోని శోభనాద్రి, జగన్నాథం, గంగమ్మ పాత్రలు చాలా సజీవంగా మనల్నిపలకరిస్తాయి. సన్నివేశాలన్నీ అత్యంత సహజంగా అలరిస్తాయి. ఆయన మంచి కవి కూడా. మంచి సాహిత్య పుష్టితో ‘పృథ్వీరాజీయం’ అనే కవితా ఖండికను రచించారు.

1916లో మనోరమ పత్రికను స్థాపించి దానిద్వారా గణపతి, రాజరత్నము, రఘుకుల చరిత్ర, సిద్ధార్థ చరిత్ర మొదలైన వాటిని ప్రచురించారు. చిలకమర్తివారు మంచి హాస్యప్రియులు. **‘నవ్వుల గని’** అనే రచనను రెండు భాగాలుగా ఆయన వెలువరించారు. ఆయన పద్యాలు, నాటకాలు, నవలలు, వ్యాసాలు రాయడమే కాదు కొద్దికాలం ఆయన అష్టావధానాలు కూడా చేశాడన్న విషయం చరిత్రలో ఒక ప్రముఖ స్థానాన్ని తన ఖాతాలో వ్రాసుకుంది.

తన స్వీయ చరిత్రను రాయమని మిత్రులనుండి ఎన్ని అభ్యర్ధనలు వచ్చినా, తనలాంటి అతి సామాన్యుడి జీవితచరిత్ర ఎవరికి వుపయోగం ఉంటుందని తన స్వీయ చరిత్ర రాయటానికి మొదట ఆయన అంగీకరించలేదు. ఆయన బాల్యమిత్రులైన రాయసం వెంకటశివుడు, విస్సా అప్పారావు గారలు బలవంతం చేయగా, సరేనని వొప్పుకుని 75 సంవత్సరాల వయసులో 21 అధ్యాయాల్లో 300 పేజీలలో తనస్వీయచరిత్రను రచించారు. తన జీవితాంతమూ సాహిత్యం కోసం, తెలుగు జాతి అభ్యున్నతికోసం, సంఘంలోని అసమానతలను తొలిగించడం కోసం ఆయన చేసిన సేవలు చాలా వివరంగా ఈ స్వీయచరిత్రలో వివరించబడ్డాయి.



ఎంతో మేథోసంపత్తితో, అబ్బురపరిచే జ్ఞాపకశక్తితో రచించిన ఈ ఆత్మకథ తెలుగు సాహిత్యంలో ఒక మహాద్భుతమని ఎందరో కీర్తించడం జరిగింది. అంతేకాదు ఈ ఆత్మకథలోని కొన్ని భాగాలు తెలుగువాచకాలలో పాఠ్యాంశాలుగా కూడా కొనసాగాయి.

ఆయన గొప్ప అనువాద రచయిత కూడా. అనేక సంస్కృత నాటకాలను తెలుగులోకి అనువదించారు. వీటికితోడు కృష్ణమూర్తి అయ్యర్ రచించిన వాల్మీకి రామాయణాన్ని, బంకించంద్ర ఛటర్జీ **‘లేక్ ఆఫ్ పామ్’** ఆంగ్ల నవలను చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు తెలుగులోకి అనువదించి ఎన్నో ప్రశంసలను పొందటం జరిగింది. ఆయన మంచి చరిత్రకారుడు కూడా. రామకృష్ణ పరమహంస చరిత్ర, కాళిదాస చరిత్ర, సిద్ధార్థ చరిత్రలతో పాటు ఎందరో మహాపురుషుల జీవిత చరిత్రలను మూడుభాగాలుగా చాలా సారవంతమైన రీతిలో తెలుగుజాతికి అందించారు.

ఆయన జీవితంలో కొన్ని గమ్మత్తయిన సంఘటనలు జరిగాయి. అందులో ఓ సాయంకాలం స్నేహితులంతా కూర్చున్నాక, వారు పకోడీలు తెప్పించి చిలకమర్తి వారిని పద్యాలు చెప్పమని కోరితే వెంటనే ఆయన ఆసువుగా **“కవులకు అక్షర లక్షడిచ్చెడి కాలము గతించినది / పద్యమునకు పకోడినిచ్చెడి దుర్దినములు వచ్చినవి”** అంటూ హాస్యోక్తులు విసిరి అందరినీ ఆనందపరిచాడట.

మరో సందర్భంలో నల్లుల బాధపడలేకే మహావిష్ణువు మంచం మీద కాకుండా ఆదిశేషునిపై పవళిస్తున్నాడని చమత్కరిస్తూ నల్లిమీద కూడా ఆసువుగా పద్యం చెప్పి అందరినీ ఆయన ఆశ్చర్యపరిచాడట.

హాస్యాన్ని నిండుగా పండించి సమయస్ఫూర్తితో మాట్లాడటం చిలకమర్తివారికి వెన్నతో పెట్టిన విద్య. ఎంతటి క్లిష్టతరమైన పద్యానయినా ఆసువుగా చెప్పటం, తిరిగి ఆ పద్యానికి సరళమైన భాషలో అర్థం వివరించి చెప్పటం ఆయనకు మాత్రమే సాధ్యంగా మిగిలిపోయింది.

భారతదేశ స్వాతంత్ర్యాన్ని కాంక్షించిన చిలకమర్తిగారు తన రచనల ద్వారా తన పాత్రను ఘనంగానే పోషించారు. బ్రిటిష్ పాలనను నిరసిస్తూ ఆయన పద్యాలను, గేయాలను, వ్యాసాలను, నాటకాలను రచించారు.

**”భరతఖండంబు చక్కని పాడియావు / హిందువులు లేగదూడలై ఏడ్చుచుండ / తెల్లవారను గడుసరి గొల్లవారు / పితుకు తున్నారు మూతులు బిగియగట్టి...”** అంటూ

చిలకమర్తి లక్ష్మీనరసింహం గారు రచించిన ఈ పద్యం స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో చాలా సుప్రసిద్ధంగామారి, అందరినోట చాలా ఇష్టంగా పలకబడింది. ‘దేశమాత’ అనే వారపత్రిక ద్వారా బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ఆయన అనేక రచనలను అందించారు.

చిలకమర్తి లక్ష్మీనరసింహం గారు మొదటితరం సంఘసంస్కర్త. దళితులకోసం ప్రత్యేకమైన పాఠశాలలు ఎవరూ స్థాపించని కాలంలో ఆయన ముందుకు వచ్చి సామాజికంగా వెనకబడిన దళితులకోసం 1909లో రామమోహన పాఠశాలను స్థాపించారు. కేవలం తన సొంత డబ్బుతో ఆ పాఠశాలను నడిపి ఒక చరిత్రను సృష్టించారు. ఈ విషయాన్ని తెలుసుకుని అప్పటి మద్రాసు గవర్నరు **‘లార్డ్ పెంట్ లాండ్’** చిలకమర్తి గారిని ఎంతగానో ప్రశంసించారట. మహాత్మాగాంధీ దక్షిణాఫ్రికా నుండి రాకముందే ఈ పాఠశాలను ప్రారంభించడం ఒక విశేషంగా చరిత్రలో మిగిలిపోయింది.

చిలకమర్తి లక్ష్మీనరసింహం గారు గొప్ప వక్త. ఏ విషయాన్నయినా నూటిగా, ధాటిగా గంటలకొలది ఆకర్షణీయంగా అందరినీ ఆకట్టుకునేలా మాట్లాడగలిగిన దిట్ట ఆయన. కలకత్తా బ్రహ్మసమాజం నాయకుడు, పండిత శివానంద శాస్త్రి, చిలకమర్తి లక్ష్మీనరసింహంగారిని **‘లోకల్ షేక్స్పియర్’** గా ప్రశంసించాడు. జాతీయ, అంతర్జాతీయ సాహితీ పండితుల మన్ననలను పొందిన మహనీయుడు ఈయన. 1943లో ఆంధ్ర విశ్వవిద్యాలయం వారు చిలకమర్తి వారిని **‘కళాప్రపూర్ణ’** పురస్కారంతో సత్కరించారు.

కవిగా, మహావక్తగా, పండితుడుగా, పత్రికాధిపతిగా, నాటకకర్తగా, నవలా రచయితగా, సంఘసంస్కర్తగా, దేశభక్తుడుగా, బహుముఖ ప్రజ్ఞాశాలిగా తెలుగువారి అందరి హృదయాలలో ఎంతో విలక్షణమైన, విశిష్టమైన ఉన్నతమైన స్థానాన్ని సంపాదించుకున్న చిలకమర్తి లక్ష్మీనరసింహం గారు 1946, జూన్ 17వ తేదీన రాజమహేంద్రవరంలో మరణించారు.

ఆకాశానికి, నేలకు, నిప్పుకు, నీటికి, గాలికి మరణం లేనట్టే, సామాన్యతలోనే అసమాన్యతను ప్రదర్శించిన చిలకమర్తి లక్ష్మీనరసింహం గారి సారస్వత సంపద ఎప్పటికీ సజీవంగానే తెలుగుజాతిని పలకరిస్తూ, తరాలుదాటి తరాలను పులకరింపజేస్తూనే వుంటుంది. విస్తారమైన సాగర సాహిత్య సంపత్తి కలిగిన ఈ మహానుభావుడికి ఘనమైన నివాలులు సమర్పించుకుందాం.

(జూన్ 17 చిలకమర్తి లక్ష్మీనరసింహం గారి వర్ధంతి సందర్భంగా)



**–డాక్టర్ కె.జి. వేణు**
98480 70084

---

## కవితార్చన



అడ్మిన్: **డా॥రాధాకుసుమ**
సెల్:99892 41319

“కుసుమ ధర్మన్న కళా పీఠం” సంస్థ ప్రతిరోజు కవిత్వ రచన చేయిస్తుంది. అందులో ముఖ్యమైన కొన్ని కవితలను నేటినిజం పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం..
–సంపాదకులు

### తెలంగాణ ఆవిర్భావం

నివురుగప్పిన
నిప్పు దిగ్గున లేచింది
వందేళ్ల చరిత్రను తిరగరాసింది
ఉవ్వెత్తున ఎగిసిపడే కెరటమై...
బంధనాలు తెంచుకొని స్వేచ్ఛా విహంగమై
విహరిస్తుంది నేడు
మన తెలంగాణ..
మరుగున పడిన సాహిత్యాన్ని
కళ తప్పిన మన కళల సవ్వడి ని
వెలుగులోకి తెచ్చిన
మహనీయులు ఎందరో...
గజ్జె కట్టి ఆటపాటల మేళవింపుతో
సామాన్య ప్రజలలో ఉద్యమ
కాంక్షను రగిలించి తెలంగాణ గెలుపుకు
ఊపిరి పోసి
జానపదుల వారధి గా నిలిచిన
కళాకారులు ఎందరో...
కోటలు...శిల్పకళలు..గుడులు
గోపురాలు గతవైభవ చిహ్నాలుగా
మన సంస్కృతిని తెలియజెప్పే
నిలువెత్తు సాక్ష్యాలు...
మన తెలంగాణ సాంప్రదాయ వైభవాలు...
నేడు విశ్వమంతా వ్యాపించి
మేటిగా నిలిచిన అచ్చమైన
తెలుగుదనాల మన సక్కటి తెలంగాణ
కోటి రతణాల వీణ

**–కళావతి కందగట్ల,**
హైదరాబాద్

### మనిషికి విలువ లేదు

చీకటి గది లో ఉన్నప్పుడు
తెలిసింది
వెలుతురు విలువ
ఆపదలో ఉన్నప్పుడు
తెలిసింది
మనిషి విలువ
కాలం గడిచే పోయాక
తెలిసింది
కాలం విలువ
కష్టాల్లో ఉన్నప్పుడు
తెలిసింది
సుఖం విలువ
విలువలకు విలువ ఇచ్చే
ఆ రోజులు పోయాయి
నేడు
వలువలకు విలువ పెరిగి
ఉన్నప్పుడు పట్టించుకోక
పోయాక ఫోటోలకు
పూల మాలలు
బతికున్నప్పుడు ప్రేమగా
తినిపించక
సమాధి వద్ద పంచభక్ష
పరమాన్నలు ఎందుకు
ఈ సమాజంలో
విలువలకు వెల లేదు
వలువలకు వెల ఉంది
అందుకే..
మనిషి విలువ మరణిస్తే కాని
తెలియదు
నేటి సమాజంలో....!

**–కాళహస్తి వెంకట శేషగిరిరావు**

### పర్యావరణం మన చేతుల్లోనే..

పచ్చని తరువులు,చిక్కటి వనాలు
చల్లటి గాలులు, అల్లన సాగే ఝరులు
ప్రకృతిలో అమరిన అందాలు
ఈ అందాలు,పర్యావరణానికి ఊపిరులు.
ప్రకృతి సహజంగా వుంటేనే,
పర్యావరణంలో సమతుల్యం
పరిసరం నైర్మల్యంగా వుంటేనే,
వాతావరణం ఆహ్లాదకరం!.
పచ్చగా నవ్వే ధాత్రికి, వేడి కవచం,
నేలతల్లిని పరచుకున్న ప్లాస్టిక్ భూతం?
ప్లాస్టిక్ వ్యర్థాలతో ప్రకృతి కళావిహీనం
పారే తటినిలో చేరుతున్న రసాయన వ్యర్థం
త్రాగే నీటికి అంటువ్యాధిగా కలుషితం
జీవరాశి మనుగడకే ప్రశ్నార్థకం.
అభివృద్ధి కోసమో, జనావాసాల
కోసమో
తరిగి పోతున్న అటవీ ప్రాంతం
అధికమై పోతున్న భూతాపం
దరికి చేరని ఓజోన్ కవచం!.
చేతులు కాలాక
ఆకులు పట్టుకునేకంటే
అందరం చేతులు కలుపుదాం
చెట్లను పెంచుకుందాం
పర్యావరణాన్ని
పచ్చగా కాపాడుదాం.
చెట్టు పచ్చగా వుంటే
మనం ఆరోగ్యంగావుంటాం.

**– కరణం హనుమంతరావు**
63000 43818

### ఆకలి చీకటిలో చంద్రుడు

పూరి గుడిసెలో తొంగి చూసే చల్లని కిరణాలు
పొయ్యిలో లేవని పిల్లిని చూసి పక పక నవ్వితే
ఆకలి పేగుల ఆర్తనాదాలు విని చంద్రుడు
భయపడి పారిపోకుండా ఉంటాడా...!
పట్టుదలతో గీసిన కలల రెక్కలు
పోరాటంలో నలిగిన పసి ముక్కలు
వాటికీ వెలుగు కావాలన్న ఆశతో
చెమ్మచెదరని చూపులు కదలుతు ఉన్నాయి .
పట్టణం మెరుపుల్లో దాగిన న్యాయం
పల్లె బతుకుల్లో పడుతున్న కష్టం
ఆకాశమే ఓ గుడిసె కింద వాలితే
ఆకలికి దీపం చంద్రుడైనా కాలేడా.

**–విజశ్రీ దుర్గ**, 90302 25437

### ప్రేమైక జీవనం సాగిద్దాం

రెండు మనసులు కలిసిన తరుణం
రెండు హృదయాలు పలికిన గీతం
ఒకే హృదయమై వెలసిన వైనం
ప్రేమ యనేదే ఓ మధుర భావం
ఒకరిని ఒకరు కలిసి, చేయి చేయి కలిపి
ఇచ్చుకున్న హృదయాకారపు బహుమానం
వికసించిన పూవు వోలే పరిమళిస్తే ఆనందం
తనవులు కలిసి తలపులు పండగా
వికటించి, విలపిస్తే, విషాదమయితే దుఃఖం
నేటి సమాజములో, బరితెగింపులకు కొదువలేదు
బహుమానాలకు విలువ లేదు
ప్రేమ బంధం, యమపాశమై, ముత్యు ఒడిన చేరితే!
కన్నవారి కడుపు శోకాలకు కారణమైతే!
ఆ ప్రేమల విలువల ఏముందని అర్థం చేసుకో యువతా
ప్రేమతో వెలసిన సృష్టిలో, ప్రేమ అర్థం తెలిసి మసలుకో
బరితెగింపులు, బహుమానాలు కావమ్మా ప్రేమంటే
రెండు హృదయాలు ఒకటై, బ్రతుకు అర్థం తెలిపేదే ప్రేమ
ప్రేమైక జీవనం సాగిద్దాం, పరువుగ సమాజాన్ని నడిపిద్దాం.

**– కె వి యస్ గౌరీపతిశాస్త్రి(వీరవతి)**, 9502101502

### మన తెలుగు

వెలుగుతుంది తెలుగు
వ్యాపిస్తుంది తెలుగు
వర్ధిల్లుతుంది తెలుగు
శోభిల్లుతుంది తెలుగు.
వ్రాయిస్తుంది తెలుగు
పాడిస్తుంది తెలుగు
పువ్వులుపూస్తుంది తెలుగు
పరిమళాలుచల్లుతుంది తెలుగు.
ఆకర్షిస్తుంది తెలుగు
ఆహ్వానిస్తుంది తెలుగు
మదినిమీటుతుంది తెలుగు
హృదినితట్టుతుంది తెలుగు.
తీపినిస్తుంది తెలుగు
స్ఫూర్తినిస్తుంది తెలుగు
పలికిస్తుంది తెలుగు
మురిపిస్తుంది తెలుగు.
వినమంటుంది తెలుగు
విందునిస్తుంది తెలుగు
ఖ్యాతినిస్తుంది తెలుగు
సత్కారాలిస్తుంది తెలుగు.
చక్కగనుంటది తెలుగు
శ్రావ్యంగుంటది తెలుగు
ఇలసాటిలేనిది తెలుగు
కడుమేటియైనదితెలుగు



**–గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్,** సెల్: 7981616630

---

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 1477వ రోజు ‘మద్యపానం’ అనే అంశంపై పలువురు కవులు తమ కవితలను పంచుకున్నారు. కవితల సాధన చేస్తున్న కవులందరికీ అభినందనలు. ‘మద్యపానం’ అంశంపై వచ్చిన కొన్ని కవితలను ‘నేటి నిజం’ పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం. –సంపాదకులు

**మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సవ మాహం**
అడ్మిన్ & ఏకాంశ కవిత్వ నిర్వహణ:
**–డా॥రాయారావు సూర్యప్రకాశ్‌రావు,** 9441046839



### జీవితమొక మధుమాసం

మధువు
విషమా!
అమృతమా!
మృతమా
మద్యం మధురమేనా!
మద్యం మధురమైతే
శారీరక వికృత విన్యాసాలేల!
అపనిందల నిప్పుల
మాటల మూటలేల!
మితిమీరితే మరో అతిథి పాత్ర
అపరిచితుడు ప్రత్యేక ప్రవేశం
చేమంతి రేకులు లేని పుష్పవిలాపం
తనువైన ప్రేమ పక్షులు
విలవిల చూపులు.
నిజం నిష్టూరంగానే ఉంటుంది
తాగి బహు భేషుగ్గా బతికిందెవరో!??
అప్పుల తిప్పలతో ఆసుపత్రులెంట
తిరిగేది ఎందరో?!
మధువు మంచిదైతే
సురలకెందుకు
పంచేను జగన్మోహిని!
శ్రమజీవుల శ్రమను
చలిచీమల్లా దోచే క్రతువిదీ
ఎపుడు ఆగేనో
ఈ వ్యసన మహమ్మారి హతవిధీ
మనిషి బలహీనతలపై
భేషైన వ్యాపారం
మద్యం గంజాయి
పొగాకు ఉత్పత్తులు.
ప్రపంచ శాంతి కాముకుల్లారా!!!
హంస గుణ నిధులారా!!
భువి ఒక అందాల నందనవనం
జనులంతా వాడని
పరిమళాల దవనపత్రాలు
తన్నోడకుండా తనకు తాను నిలబడే
కాసింత జ్ఞాన ఫలాలను పంచండి
అమృతగుణశేఖరులను పున్నమి
చంద్రుడిలా నిలబెట్టే యోచన ఇవ్వండి.

**–ఏదెల్లి రాములు**

### తూలే వాలే!

మత్తెక్కించే మద్యంతో జీవితం
పడమటిసంధ్యకు వాలు
సీసాలు సీసాలు పొట్టలో ఎక్కించి
పీపాలాగా ఆకారం
రోగాల పుట్ట దేహం
ఠాప్ మనే గుండె
ఏడ్పు మొత్తుకోళ్లతో
అనాథలుగా కుటుంబాలు.
సురాపానం అని పేరుపెట్టి
దేవతలు తాగారుగా అని
ఎడ్డెమంటే తెడ్డెమనే వాదం
రక్తనాళాలు ఫట్ గుండె ఠాప్!
హింస దౌర్జన్యాలతో
హత్య ఆత్మహత్యల కేంద్రంగా రాష్ట్రం.

మద్యనిషేధం
అమలయ్యే రోజులు డ్రై డేస్
మహాత్మాగాంధీ మద్యనిషేధానికి
మంగళం పాడుతున్న రాష్ట్రాలు
పూటుగా తాగించి జనాల్ని జోకొట్టి
జోలెపట్టించే జనాలు.
అన్నిటా ముందంజ
లేడీస్ ఫస్ట్ అంటూ
భారతీయ స్త్రీల విశృంఖలత్వం
మద్యంమత్తులో
డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడే
ప్రబుద్ధులు
ఒత్తిడి బాధ మర్చిపోటానికే అని
కుంటి సాకులు.
నడక సైక్లింగ్
జాగింగ్ యోగాతో
మద్యపానానికి సలాం కొట్టొచ్చు
మనసుంటే మార్గం
తాగుడొద్దు తూగుడొద్దు
లక్షాధికారి భిక్షాధికారియై
అలమటించనేల?
ఏడుస్తూ ఏడ్పించకు.

**–ఎ.రాజ్యశ్రీ**

### ఇసుముక్కల వైను

ఆ.వె. వాలు కుర్చిలోన వాహ్వారె కూర్చుండి
మందు కొడదమనుచు మామ తోడ
మద్యపానములను మామూలుగా పోసి
నీరు నింపుచుంద్రు నిండుగాను!.

ఆ.వె. అయిసు ముక్కలేసి నానందముగ వైను
నిండు గ్లాసునెత్తి మండుచున్న
పెగ్గు మీదపెగ్గు పిల్లలు సహితము
త్రాగుచుంద్రు చూడు తడుముకోక!.

**–జక్కని గంగాధర్**

### వ్యసనం

ముచ్చటగా మొదలౌతుంది
మనిషినే బానిసగా చేసుకుంటుంది
మానలేని వ్యసనంగా మారుతుంది
కుటుంబాలను కూల్చేస్తుంది
అనుబంధాలను తెంచేస్తుంది
దేహాన్ని పీల్చి పిప్పి చేస్తుంది.
మద్యపానం తన పేరన్నది
తొలుత స్వర్గాన్ని తలపిస్తుంది
మత్తులో ఊయలలూగిస్తుంది
మరో లోకాన విహరింప జేస్తుంది.
ఆలి పోరు పెడితే మనఃశాంతి కంటుంది
అనుకూలంగా సాకులెన్నో చూపిస్తుంది
సీసా లోనిది గొంతున పోసుకుంటుంటే
కాలకూటాన్ని మోసే సర్పమై పోతుంది
గొంతు నుండి కాలేయానికి పాకి పోతుంది
కాలేయాన్ని అంచెలంచెలుగ కాటేస్తుంది
కడకు నిర్వీర్యం చేసేస్తుంది
ప్రాణాలకే ముప్పు తెస్తుంది.
సంతానానికి చక్కని సంప్రదాయం
వారసత్వంగా ఇవ్వడమే మేలైన పరిష్కారం.

**–జె.వి.కుమార్ చేపూరి**

### మత్తు వదులు

మద్యపానం
మరో పేరు సురాపానం
మద్యపాన సేవనం తప్పు
ఎప్పటికైనా తప్పదు ముప్పు.
ఉద్యమాలు ఎన్నో చేసామన్నా
కాని ఫలితం మాత్రం సున్నా
మహమ్మారి తీసింది ఎన్నో ప్రాణాలు
చేసింది ఎన్నో కుటుంబాలను కుదేలు.
మద్యపాన నిషేధం పై చట్టాలు
కొందరికే అవి చుట్టాలు.
సేవనం ఇవ్వచ్చు భలే కిక్కు
సేవించకుంటేనే ప్రాణం దక్కు
మత్తులో మరుస్తారు ఉచ్చం నీచం
ఆ దశలో భగవంతుని మాటైనా ఆలకించం.
ఎందరో ఇల్లాళ్ళ ఆక్రందన
ఎప్పటికి తీరేను వారి వేదన
మద్యపాన మత్తు వదులు
మంచి మనిషిగా ముందుకు కదులు.

**–ద్విభాష్యం నాగలక్ష్మి**

### అతి సర్వత్ర వర్జయేత్

అతి సర్వత్రవర్జయేత్
అవసరానికి మించి వాడితే
ఔషధమైనా విషమే
అన్నమైనా మితంగా
తీసుకొంటేనే ఆరోగ్యం
అనాదిగా మానవుల జీవితంలో
భాగమైంది మద్యపానం
పురాణాల్లోనే
పురుడు పోసుకున్న సురాపానం
చెడుకు అతిగా ఆకర్షణ సహజం
మత్తుకు అలవాటు పడితే
జీవితం దుర్భరం..
పండుగకో పబ్బానికో
అలసిన మనసుకు ఆలంబనకో
సంతోషానికైనా విషాదానికైనా
లంచానికైనా మంచానికైనా
ఇందు కలదందు లేదని
సందేహం వలదు
ఏ సందుల్లోనైనా
బెల్టు రూపంలో సాక్షాత్కారం
నీ ఇంటికి వస్తే ఏమి పోస్తావు
నా ఇంటికి వస్తే ఏ బ్రాండు తెస్తావు
సమస్య ఏదైనా
సమాధానం బారుల్లోనే
విషాన్ని విచ్చలవిడిగా పుచ్చుకుంటే
నీ గోతిని నీవే
పెగ్గులతో పూడిక తీసుకోవడం
ఆనందక్షణాల్ని
ఆహ్లాద వాతావరణాన్ని
ఎలా ఆస్వాదించాలో తెలియక..
ఓపిక లేక దబడిదిబడిగా
ఆత్రుతగా దొంగకు దొరికిందేదో
చేజారి పోతుందనే ఆవేశం.
కడుపులో కెళ్లిన మద్యపానం
మరణానికి పునాదులు వేస్తుంది..
వ్యసనంగా మారితే త్వరలో
జీవితానికి శుభం పలుకుతావో
చెడు సావాసాలతో సంక్రమించిన
మద్యపానాన్ని వదిలించుకొంటావో
నియంత్రించుకొంటావో
నిర్ణయం నీ విచక్షణకే
మద్యపానానికి బానిసలుగా మారితే
బజారులో కుక్క బతుకే.

**–లోడె రాములు**

### మత్తు బతుకుల నిరాశ

మత్తు బతుకుల నిరాశ
ఆలోచించే మెదడుకి
మత్తును కలుగచేసి
పరిసరాలను మైమరపింపచేసి
మంచీ చెడుల తేడా తెలియకుండా చేసి
ఉన్మత్త స్థితికి
చేరాలనుకునే వారికే మద్యపానం
ఎన్నో వంకలు
ఆనందానికీ.
పరితాపానికీ
హోదాను కనబరచడానికీ
హోదా పోయినందుకూ
ప్రేమలో గెలుపుకూ
ప్రేమలో ఓటమికీ.
దానికీ దీనికీ అని లేదు
ప్రతి దానికీ మద్యపానం
అంతెందుకు
మద్యపానాన్ని నిషేధిస్తే
ప్రభుత్వాలే కూలిపోతాయి.
ఇది అందరికీ నా!
అందరికీ కాదు – కొందరికే
వారే మద్య వ్యసనానికి బానిసలు
మద్యం కోసం ఎవరినైనా వదలడానికి సిద్ధం
మద్యపానాన్ని వదలమంటే యుద్ధం
మద్యం కోసం చెబుతుంటారు అబద్ధం
శ్రేయోభిలాషుల మాటలు వారికి విరుద్ధం
వీళ్ళతో వేగే భార్యలకది ప్రారబ్ధం.
తమను తాము అదుపు చేసుకోలేని వారు
మితంగా స్థితులను అలరించలేనివారు
మద్యపానానికి బానిసలైతే
వారి బతుకులకే కాదు
వారిపై ఆధారపడిన
బతుకులకూ నిరాశే!.

**–విత్తనాల విజయకుమార్**

### నాగరికతకు నగిషీ

మద్యపానం సామాజిక దురాచారం
కుటుంబాలకు కుటుంబాలు కూలిపోవు
వ్యవస్థలకు గ్రహపాటు
ఆరోగ్యానికి హానికరమనే హెచ్చరిక
అగుపించదు చట్టబద్ధ హెచ్చరిక
కుటుంబ ఆర్థిక వ్యవస్థ పతనం వైపే
మద్యపాన వ్యతిరేక ఉద్యమాలు ఒకనాడు
నాగరికతకు నగిషీలు చెక్కే ఈనాడు
మందు లేని విందు లేదు
ఆదాయపు ఆదరువు
ఆడామగా చిన్నాపెద్ద బేధం లేదు
మందెయ్యి చిందెయ్యి అనే నవయువత
చదువు సంధ్యలు వీడుతున్న యువత
రాత్రీపగలు బేధం లేదు
అసలు కన్నా
కొసరు ముద్దనే తీరు
కూలీలకు కూలీడబ్బుకన్నా
మందు ముఖ్యం
సంతోషానికి సంకేతం మద్యపానం
విషాదానికి విషయం మద్యపానం
నలుగురు కలిసేచోట మద్యపానం
నలుగురిలో నగుబాటుకై మద్యపానం
ఎల్లలు దాటిన మద్యం బహుప్రియం
ఏలికలను మార్చేసే మహత్తు
మద్యం లేని వేడుక ఎవరికీ రుచించదేలనో
మద్యపాన వ్యతిరేక
ఉద్యమమే లేదు ఈనాడు
మద్యపానమే మూలమంత్రమీనాడు
ఉత్తరం నుండి దక్షిణం దాకా
తూర్పు నుండి పడమర దాకా
యేరులై పారుతున్నది
సమాజపు అంతర్వాహినిగా సాగుతున్నది
ఈ వాహిని సాగేదెచ్చటికో ఆగేదెప్పటికో.

**–లక్ష్మారెడ్డి పసుల**

# హృదయం

(కథ)



–లక్ష్మణరావు పతంగే
సెల్:92900 79047

రెండ్రోజుల్సంది అకాలంగనే మబ్బులు పట్టినై. వాన పడ్తనే వుంది. ముసుర్ల మొదలయింది. ఆగుతనే లేదు. అంబట్యాల కొంచెం వొరపిచ్చింది గాని మొగులు సాతం మబ్బుల్తోని నిండివున్నది. గట్లనే పొద్దు మీకింది. చూస్తుండంగనే న్యాతిరైంది. అటెన్కల అద్దుమ్మన్యాతిరైంది. మొగులుకేసి చూస్తే ఇంకా వాన కురిసేటట్లనే వున్నది. కాని తగ్గేటట్ల కన్పిస్తలేదు. రాత్రిపూట కుక్కల అరుపులు ఇన్పిస్తున్నయి. పోలీసు కచ్చేరీల రెండు గంటలు కొట్టిన సప్పుడినిపిచ్చింది. సెంట్రీ డ్యూటీలవున్న పోలీసాయన ప్రతి గంట గంటకు కంచు బిల్ల మీద గంట కొడ్తడు. గా సప్పుడిన్న రాజన్నకు మేల్కొచ్చింది. మూతబడ్తున్న కండ్లు ఒక్కసారె తెర్సుకున్నయి. మూడ్రోజుల్సంది నిద్రపోలే. నిద్ర పోనందుకు మొకం పీక్కుపొయ్యింది. కండ్లు ఎర్రంగయినై. మొకం అంతా ఇకారంగ కన్పిస్తున్నది.

మన్సుబడ్డ పొల్ల కోసం ఊరిడ్సి వశంగాని కష్టాలు పడ్తున్నడు రాజన్న. తాను ఇష్టపడ్డ పిల్లకోసం ఉన్నదంత ఇడ్సిపెట్టి పట్నం వొచ్చిండు రాజన్న. అయిన గామె అంటే తన పానం. గామె లేకుంటే బతుకెందుకు అనుకుంటడు రాజన్న. గామె కోసం పట్నమొచ్చి యమబాదలే పడ్తాండు.

అమ్మనయ్యను ఇడ్సిపెట్టి పట్నమొచ్చి రెండేండ్లయ్యింది. ఎన్కట సంతుకోసం గుళ్ళు గోపురాలు తిర్గేటోళ్ళు. కాని జమానా మారిపోయింది. పెండ్లి అయ్యేదే తడువు పోరగాళ్ళు వొద్దన్నా పుట్టుకొస్తుండ్రు. గట్లనే జరిగింది రాజయ్యకు. పట్నం వొచ్చిన కొన్నొద్దులకే మూడోపానం వొచ్చింది. రెండు పెద్ద పానాలు నడ్మ ఒక సిన్న పానం వొచ్చింది. బత్కు ఇంకా కష్టమైపొయ్యింది రాజయ్యకు. తనకు వొచ్చేది రోజు కూలీ పది రూపాలె. గది కూడా దొరికిన్రోజు దొర్కుతది లేకపోతే లేదు. పట్నంల ఏ పని దొర్కకపోయినా మేస్త్రీల చేతికింద పారపని మాత్రం తప్పక దొర్కుతది. దాన్కి గూడా పొద్దుగాల తొమ్మిది గొట్టంగ పోతే పొద్దుమీకి ఆరైతది ఇంటికి రానీకె. మేస్త్రీ పొమ్మన్నదాకా పన్జేస్తనే వుంటడు. పనిమీదనే ధ్యాసపెడ్తడు. పన్లకు దిగితే లోకం మరుస్తడు. గాయాళ్ళ కూడా కూలీ పైసలు తీస్కొని కాళ్ళీడ్సుకుంట ఇంటి మొకం బట్టిండు రాజన్న. పగలంతా గంపలు మోసి ఇంటికొస్తే పానానికి కొంచెం గూడ చైనుండదు. ఫుర్సత్ లేని బతుకయ్యింది రాజన్నది.

పొద్దుమీకింది మేయబోయిన గోదలు ల్యాగల కోసం అర్సుకుంట కొట్టాలకేసి ఉర్కుతున్నయి. కాకులు పిట్టెలు గూళ్ళకు సేరుతున్నయి. యాడజూసినా లొల్లి యిన్పిస్తున్నది.

రాజన్న పగలంత పన్జేసి అల్సిపోయిన పెయ్యితోని, పుల్లజీరిన మన్సుతోని కాళ్ళీడ్సుకుంట ఇంటికొచ్చిండు. లక్ష్మి మూలుగినిపిచ్చింది. బాధతోని మూల్గిన ఆమె మూల్గు రాజన్న మన్సుకు సూది లెక్క గుచ్చుకున్నది. గామె పండుకున్న మంచం కాడ్కి పోయి నెత్తికాడ కూసున్నడు. నెత్తిమీద సెయ్యేసి చూసిండు. జరం లేదు గాని, నాతవాని ఉన్నది. శాన బక్కగయ్యింది. కండ్లల్లకెల్లి నీళ్ళు బొట బొట గార్నై. గా రాతిరి ఎట్ల గడుస్తదా అనుకోబట్టిండు రాజయ్య.

గాయ్నకు 'నాయ్నా' అని పిల్సె బిడ్డె వొచ్చిరాని మాటలకు ఖుషీ గాకుండా దుఃఖమొచ్చింది. బిడ్డనెత్తుకొని ఎదకు పెట్టుకున్నడు. కండ్లల్ల నీళ్ళు సుడులయినయి.

లోకం మీద గాయ్నకు పట్టరాని కోపమొచ్చింది. గీ దునియాలా గీ కులం కట్టుబాట్లు ఎప్పుడు పోతయ్యో! అనుకున్నడు. అసలు గీ కులాలు ఎవడు కనిపెట్టిండో వాన్ని పట్కొని తన్నాలె. మన్సులంతా ఒక్కటయినంక 'మనుసులు' ఒక్కటయితే ఏం ఫరకుపడ్తది అనుకున్నడు. కాని గవే తనకు తనోళ్ళ నుండి దూరం చేసినై. తన్జేసిన తప్పేం లేదు. తన కులంకాని పిల్ల మీద మనసు బెట్టిండు తప్ప. తెలివి గల్లోలేమో కులాలన్నీ పొవ్వాలంటరు. మన్సులంతా ఒక్కటే కులం కావాలంటరు. కాని వాళ్ళ మాట ఎవ్వరింటరు. ఏం కతో. గివన్నీ బేకార్ మాటలే.

రాజన్న తండ్రి గావూర్కి పటేల్. తండ్రి సంపాదించిందేగాక తాతముత్తాతలు సంపాదించిన జాయ్‌దాదు శాననే వున్నది. ఊరిమీద పెద్దిర్కం. అంతా రాజన్న తండ్రి రామయ్యదే. పటేలు యింటి పక్కిల్లే సాలె రంగయ్యది. రంగయ్యకు ఒక్కతేనే బిడ్డె. గామె పేరు లక్ష్మి. బంగారం లెక్కుంటది. కొడ్కయినా బిడ్డెయినా వాళ్ళకు గామెనే దిక్కు. గామెను పానం కంటె ఎక్కువ చేసి పెంచిన్రు. లక్ష్మి అంటే సాక్షాత్తు లక్ష్మి దేవే. కమలాల్లాంటి కండ్లు. మొగిలి పువ్వు లెక్క ముక్కు. దొండపండు లెక్క పెదాలు, నల్ల నాగుంబాము లెక్క పొడుగాటి జడ. తెల్లగా అందంగ, అందమంత రాశిబోసిట్లుంటది లక్ష్మి. వాళ్ళింటి వాకిట్ల అటూ ఇటూ తిరుగుతుంటే రంగయ్య యింటి వాకిట్ల ఎవల్లో దేవకన్య దిగొచ్చిందేమో అనుకుంటరు జనం. ఒక్కసారి గామెను చూసినోడు కండ్లు మూయడుమల్ల.

రాజన్న కొన్నొద్దులు పట్నంల వుండి సద్వుకున్నడు, గాని పెద్ద సద్వు సద్వలే. ఇంక లాభం లేదన్కొని సదువు మానేసి ఊరిమొకం బట్టిండు. ఇంట్లనే ఉండి తండ్రికి సాయం చెయ్యబట్టిండు. తండ్రి కూడ కొడ్కు ఆసరైనందుకు ఖుషీ గయ్యిండు. రోజూ చేండ్లకాడికి పోవుడు జీతగాళ్ళతోని పన్లు జేపిచ్చుడు దినాం పనైంది.

పొద్దుమీక్యాళ తన మిద్దె మీద కూసోని దూరంగ కన్పిస్తున్న గుట్టల నునుపుదనాన్ని సూడసాగిండు. గవిటిని సూస్తుంటే మన్సు నిండిపొయ్యేది. గవంటే తనకు శాన యిష్టం. పురసత్తుగున్నప్పుడు గాగుట్టలు, పుట్టలు, వాగులు వంకలు అన్నీ తిర్గెటోడు. దోస్తుల్తోని కల్సి అన్నీ తిర్గెటోడు రాజన్న. కాని పట్నంల గాగాలి గాసెట్లు గాసేండ్లక్కడివి? అంతా కల్తీ కన్పిస్తుంది. పట్నంల ఎంతమంది వయసు పోరీలు కన్పించిన తనకు మాత్రం లక్ష్మి అందం ముందర వాండ్లంతా దండుగ అనిపించేది. ఊళ్ళె ఉండంగ మిద్దె మీద కూసోని సూస్తుంటె పక్కింటి వాకిట్ల లక్ష్మి కన్పించేది. కండ్లు కండ్లు గలిసేయి. మూగ బాసతోని మాట్లాడు కునేటోళ్ళు. పక్క పక్క యిండ్లే గాబట్టి కల్సి ఆడుకునేటోళ్ళు. వీళ్ళింట్లగామే వాళ్ళింట్లగీన బయం లేకుండ తిర్గెటోళ్ళు. పెద్దలెవ్వలు పట్టించుకునే టోళ్ళు కాదు. వీళ్ళ దోస్తీని చూసి మురిసిపొయ్యేటోళ్ళు. లక్ష్మి ఊళ్ళె శాలెలోన ఎనిమిది దాక సద్వుకున్నది. అటెన్క వాళ్ళ నాయ్న బడికి పంపలే. కాలమాగుతాది? ఇద్దరు పెద్దగయ్యిన్రు. ఇప్పుడు గామెకు రాజన్నతోని మాట్లాణ్ణీకె సిగ్గనిపిస్తున్నది. బెదిరి బెదిరి లేడిపిల్ల లెక్క సూస్తది రాజయ్యను. కన్నార్పకుండా రాజన్న సూస్తుంటే రాట్నం ముంగల కూసోని ఏకులు సుట్టేది లక్ష్మి. కొన్రోజులకు మల్ల కండ్లు కల్సినై. రోజు ఏదో సాకుతోని ఆమె వాకిట్లకొస్తే ఆమె కోసం యెయ్యి కండ్లతోని కాస్కొని కూసునేటోడు రాజన్న. మెల్లగ వలపు సూపులు కల్సినై గుండెల్ల ఊసులు మొదలైనయి. కండ్లతోనే పల్కరింపులు మొదలైనయి. ఒకరోజు మిద్దెమీదికెల్లి మెట్లతోని దిగి పెరట్లకెల్లి లక్ష్మి వాకిట్లకు పొయ్యి లక్ష్మి చెయ్యి పట్టుకున్నడు. 'ఇద్వు బావా! ఎవలన్న సూస్తరు' అన్నది సిగ్గుపడుతూ తల దించుకొని. సిన్నప్పట్సంది 'బావా' అనే పిలిచేది. 'పట్టిన సెయ్యి ఇగ ఇడ్సేదే లే ఏమన్నగాని' అన్నడు. గప్పట్సంది రోజూ మోకదొరికి నప్పుడల్ల ఇంటిన్కె పెరట్ల కల్సుకునేటోళ్ళు. కూసొని మన్సు యిప్పి ముచ్చట్లు చెప్పుకునేటోళ్ళు.

ఎప్పట్లెక్కనె గాయాడాది కూడ ఊళ్ళె దుర్గమ్మ జాతరొచ్చింది. ఊరి బైట కొంచె దవ్వుల అమ్మోరి గుడి ఉన్నది. గా జాతరకు ఊళ్ళెకెల్లి పిల్లలు బ్యాకలు అందరుపోతరు. రెండ్రోజులు శాన జోర్‌దార్‌గా జాతరైతది. గాడ అంగడైతది. యాడ్కెల్యాడ్కెల్లో జనం వొచ్చి దూకాండ్లు బెడ్తరు. పండ్లు పలాలు మిటాయిలు కల్లూ సారా దుకాన్లు ఒక్కటేంది అన్నితీర్ల దుక్నాలుంటయి. ఆడేపాడేటోళ్ళ లొల్లి శాననే వుంటది. ఆడోల్లు మొగోల్లు అనకుంట అందరు అమ్మోరికి పూజలు సేస్తరు. కల్లు సాకపోస్తరు. బలిబోనం పెడ్తరు. పోతరాజు గావుపట్టి పొట్టేలును బలి ఇస్తడు. పూజలయినంక తాగుడు తినుడూ సేసుకుంట పొద్దుమీకిందన్క గడ్పుతరు. గట్ల రెండ్రోజులు నడుస్తది జాతర.

జాతర ఊరికి అర్ద కోసు దూరంలనే జర్గుతది. గప్పుడెప్పుడో సిన్నగున్నప్పుడు రాజయ్య జాతర్కు పొయ్యిండు. అటెన్కల హయిదరాబాదు పట్నంకు సదవ బొయ్యిండు. మల్ల ఎన్నో ఏండ్లయ్యింది గాయన జాతరబోక. మళ్ళీ గీయేడే గావొకా వచ్చింది. పొద్దుమూకంగా మొగులంతా మోదుగపువ్వు లెక్క ఎర్రబడింది. జనమంత తామేసుకున్న గుడ్సెలు, డేరాల తాన్కి జేరిన్రు. కొంతమంది ఎడ్లబండ్ల కిందనే ఠికానా జేసుకున్రు. సీకటి బడ్తున్నది యాడజూసిన పొయ్యిల మంటలే కన్పించబట్టినయి. దూరంకెల్లి పొయ్యేటోళ్ళకు గాపొయ్యిల మంటలు కొర్విదయ్యాలెక్క కన్పిస్తున్నయి. కొన్ని జాగల్ల ఖందీళ్ళు, పెట్రోమ్యాక్స్ లైట్లు గన్పించబట్టె. జనం బిరాన బోజనాలు సేస్కొని అట్టకాడ్కి సాగిన్రు. అట్ట అంటే నాటకాలు ఏసే స్టేజి. ఎందుకంటే గాడ రాత్రికి బాగోతాలాడ్తరు. మోమిన్‌పేట మ్యాళం వచ్చిందని పగలే డప్పు కొట్టిచ్చి చాటిచ్చిన్రు. అట్టమీద పెట్రోమ్యాక్స్ లైట్ల గోలలు జిగేల్లుమని మెరుస్తున్నాయి. జనం ఒక్కొక్కల్లే అట్ట ముందర వొచ్చి కూసున్నరు. అంతల్నే ఊరి పెద్దమన్సులు అట్టమీదికెక్కి మాట్లాడిన్రు. అందర్ని లొల్లిసెయ్యకుండ కూసోని సూదుండ్రి బాగోతం శాన బాగున్నదని చెప్పి దిగిపొయ్యిన్రు. బాగోతం మొదలయ్యింది. "మాంగళం జగదీశా జయ మాంగళం పరమేశా" అని పార్ధన జేసిన్రు.

గానాటకం పేరు శ్రీకృష్ణ రాయబారం అంట. ఏశాలు గట్టినోళ్ళు పరదా ముందుకొచ్చి పాటలు పాడుకుంట ఎగురుకుంట అటూ ఇటూ తిరుగుతున్రు. కిష్ణుడు వొచ్చిండు, కౌరవుల సభల నిలబడి పద్యాలు సద్వెండు. దుర్యోధనుడు పాండవులకు రాజ్యం పంచి యియ్యనన్నడు. "కిష్ణుడు నువ్వెట్లియ్యవో నేను గూడ సూస్త" అన్నడు. గిట్లా గమ్మత్తుగ నాటకం నడుస్తున్నది. గట్లనే అద్దుమ్మన్యాతిరైంది. బాగోతం బలే రంజుగ నడుస్తున్నది. గంతల్నే 'కడ కడ కడేల్' మని యాడనో పిడుగుబడ్డది.

జనమంత ఒక్కసారె మొగులుకేసి సూసిన్రు. సిమ్మసీకటి. లైటుల ఎల్గుల ఏం కనిపియ్యలే. గాలి దుమారం లేసింది. గా గాలికి లైట్లు ఆరిపొయ్యినై. వాన చిన్కులు మొదలైనయి. సూస్తుండగనే జోరందుకున్నది వాన. జనమంత అర్సుకుంట సీకట్ల తలోదిక్కు ఉర్కిన్రు. వాండ్లేసుకున్న గుడిసెలు, బండ్లు యాడున్నయ్యో సీకట్ల తెలుస్తలేదు. వాన జోరందుకున్నది. సూస్తుండగనే కుండల్తోని గుమ్మరిచ్చినట్ల కుర్వబట్టింది. జనాల దుప్పట్లు, గొంగళ్ళు గాలికి యాడ బోయినయ్యో తెలుస్తలేదు. జనమంత అట్టమీద చేరిన్రు. బరువు ఆపలేక అట్ట కూలిపొయ్యింది. చాందినీ, ఖన్నాతులు ఎగిరిపొయ్యినయ్యి. వేషగాండ్లంత యాడ జగ దొర్కితె గాడనక్కిన్రు. ముసలోళ్ళ గోసగాదు. పోరలొక దిక్కు, పెద్దలొక దిక్కు, ఆడోళ్ళు మొగోళ్ళు ఒక్కరికొక్కరు సీకట్ల కల్వకుంటయిన్రు. వాళ్ళోళ్ళ కోసం గట్టిగ పేరుబెట్టి క్యాకలెయ్యసాగిన్రు. దుర్గమ్మ తల్లికి కోపమొచ్చిందేమో, తల్లీ దండం తప్పులు చమించు మన్కుంట మొక్క సాగిన్రు. వాన ఆపుమని మొక్కులు మొక్కి ముడుపులు గట్ట సాగిన్రు.

గా జాతర నూద్దామని రాజయ్య దోస్తుగాండ్లతోని కల్సిపొయ్యిండు. గా వానగాలి దుమారంల రాజన్న కూడా యాడనన్న నిలబడ్డమన్కొని ఉర్కబట్టిండు. మబ్బులుండబట్టి అంతట సీకటే వున్నది. వాన ఆగుతలేదు. ఆ జాగల చిట్టి పొదలే ఎక్కువ ఉన్నయి. పెద్ద పెద్ద సెట్లు శాన లేవు. భూమ్మీదంతా నీళ్ళే నీళ్ళు. రాజన్న తాను దేరా ఏసుకున్న చెట్టు ఆనవాలు పట్టుకుంట ఎళ్ళసాగిండు. గట్ల పోతనే వుండు. ఎవలెవల్లో ఎదురైతున్నరు. 'ఎవ్వలు నువ్వంటె, నువ్వెవలు' అని ఒకళ్ళ నొకళ్ళు ఆనవాలు చేసుకుంట వాళ్ళోళ్ళు ఎవల్లయిన కన్పిచ్చిన్రా! అని అడ్గబట్టిన్రు.

గట్ల పోతున్న రాజయ్యకు ముంగల ఓ ఆకారం నీడ లెక్క కన్పిచ్చింది. కింద కూసోని మూల్గుతున్నది. రాజయ్యకు బయమేసింది. ముందుగాల దయ్యమేమో అనుకున్నడు. గట్లనే నిలబడ్డడు. మూల్గు ఆగుత లేదు. 'అమ్మో! అమ్మో' అంటనే వుంది. రాజన్న ధైర్నెం జేసుకొని దగ్గర్కిపొయ్యి 'ఎవలు నువ్వు' అని అన్నడు. 'అమ్మో' అన్నది కాని మాట్లాడలే.

రాజన్న 'ఎవలు? పల్కుతలేరెందుకు? ఏమైంది సీకట్ల' అని గట్టిగనే అడిగిండు. గా మూల్గుతున్న మన్సి రాజన్న గొంతు ఆనవాలు బట్టి 'బావా! నువ్వా' అన్నది. 'లక్ష్మీ నువ్వేనా! ఏమైంది సీకట్ల మూల్గుక్కుంట కూసున్నవేంది' అన్నడు దగ్గర్కిపొయ్యి.

'వానల బండికాడ్కి పోదమని ఉర్కివొస్తుంటే బురదల కాలు జారి పడ్డ బావా! కాలు బెనికింది. నడువొస్తలేదు. అమ్మ నాయ్న నా కోసం యాడ ఎత్కుతున్రో ఏమో బావా!' అంటే, "బయపడకు నేనేసుకున్న డేరా గదే, గాడ్కిపోదంపా. గీ వాన జోరుతగ్గింది గాని ఆగేటట్లు లేదు. గుడ్డి మొగులున్నది. లెవ్వ' అని ఆమెను లేపి ఆమె ఎడమ చేతిని భుజం మీదేసుకొని తన కుడిచేతిని గామె నడుం మీద ఏసి లేపి మెల్లంగ డేరా కాడ్కి నడ్పిచ్చుకుంట తీస్కొపోబట్టిండు. సిన్నప్పట్సంది కల్సి ఆడుకున్నరు. పెద్దగయిన్రు వయస్సొచ్చింది. గా వాన వాళ్ళిద్దర్ని ఒక్కటి జేసింది. ఒకర్నొకరు వాటేసుకొని నడ్సుకుంట ఇద్దరూ మన్సుల దేవునికి దండం పెట్టుకున్నరు. తాము గిట్లనే జీవితాంతం కలిసి ఉండాలె అనుకున్నరు. గిసువంటి మోకా ఎప్పుడొస్తాదా అని రోజూ ఎదురు జూసుకుంట చూపులు కలిపేటోళ్ళు. గీయాళ గది నిజమైంది దుర్గమ్మ తల్లి ఆశీర్వాదం దొర్కింది. ఇద్దరు ఒక్కటయిన్రు. గా గాలి దుమారం వీళ్ళను ఒక్కటి జేసింది. దుర్గమ్మ తల్లికి మన్సులనె మొక్కుకున్నరు. వాన ఎల్సింది. ఎలుగొచ్చింది. ఒక్కొక్కల్లు అందరు వాండ్ల ఠికానాలకు చేరిన్రు. సామాన్లు సర్దుకున్రు. లక్ష్మి బావ చెయ్యి వొదిలి వాళ్ళమ్మ ఉన్న కాడ్కి పొయ్యింది. గంతల్నె తెల్లార బట్టింది. జనం అంత తడ్సిన బట్టల్తోని ఊరి మొకం బట్టిన్రు. రాజన్న లక్ష్మి ఎవరిండ్లకు వాండ్లు పొయ్యిన్రు. ఇద్దరికి రాత్రి జరిగిన సంగతి మన్సుల మెస్లసాగింది.

రాజన్న లక్ష్మిని హమెషా తన దాన్ని సేస్కోవాలనుకున్నడు. కాని ఎట్ల? లక్ష్మి వేరే కులం పిల్ల. మీదికెల్లి ఇంటి పక్క పిల్ల. ఎన్నో వొద్దులు ఆలోశన చేసిండు. ఏం చెయ్యల్నో తోస్తలేదు. ఆఖర్కి గుండె గట్టిగ జేస్కొని ఉండబట్టలేక తండ్రికి జెప్పిండు. తండ్రి గామాటిని అగ్గిమీద గుగ్గిలం అయ్యిండు. మీద్కెల్లి 'సెడ బుట్టినవుర' అని నాల్గు తిట్టిండు. గాపని గిట జేస్తివా అంటే నా యింట్ల ఉండనీకె యాల్లేదన్నడు. లక్ష్మి తండ్రిని పిల్చి మొకంమీదనే తిట్టిండు. బిడ్డెను అదుపుల బెట్కోమన్నడు. లేకపోతే బాగుండదన్నడు. మొకం న్యాలకేస్కొని యింటికొచ్చి బిడ్డెను పిల్చి చెంపమీద ఈడ్సి గొట్టిండు. ఎందుకు కొట్టిండో లక్ష్మికి తెల్వలేదు. గాదెబ్బకు చెంప కందిపొయ్యింది. కండ్లు బైర్లు గమ్మినయి. ఇంట్లకెల్లి బైట కాల్పెడితివా అంటే నివ్వు నా బిడ్డవే కావన్నడు. తండ్రి కొట్టినప్పట్సంది లక్ష్మి ఇంట్లకెల్లి బైట కాల్బెట్టలేదు. ఏకులు వడుక్కుంటగాని సరి అద్దుకుంటగాని వాకిట్ల కన్పియ్య లేదు.

రాజన్న రోజు పొద్గాల పొద్దుమీకి వాళ్ళ మిద్దె మీదెక్కి లక్ష్మి వాళ్ళ వాకిట్ల సూడబట్టిండు. గాని లక్ష్మి శానొద్దుల్సంది వాకిట్లకు గూడ వొచ్చుడు మానేసింది. ఓ దినం అనుకోకుండనే రాజన్నకు లక్ష్మి కన్పించింది. పానం లేచొచ్చినట్లయ్యింది రాజన్నకు. దుబుక్కున వాళ్ళింటి గోడ దుంకి వొచ్చి లక్ష్మి రెండు చేతుల పట్కొని 'లక్ష్మీ నేన్ పెళ్ళంటూ చేస్కుంటే నిన్నే చేస్కుంట. లేకపోతే గిట్లనే వుంటగాని ఇంకొకల్లను సేస్కోను. నా మాట నమ్ము. కాదనకు' అన్నడు. "రోజూ మనం సిన్నప్పట్సంది కల్సి ఆడుకున్నం, పాడుకున్నం. గాని ఇప్పుడు సిన్న పిల్లలం గాదు. వైసొచ్చింది. మనం కల్సి తిర్గినా, ముచ్చట్లాడినా దునియా ఊరుకోదు. మొన్న మీ అయ్య మా నాయ్నని పిల్సి మొకం మీద తిట్టిండు. మా నాయ్న నా చెంప పలగొట్టిండు బావా! ఏం చెయ్యాల్నో సమఝయిత లేదు. గందుకె గాదినంసంది నీ కండ్లబడకుండ తిర్గుతున్నా! నువ్వు ఎంత బాధపడ్తున్నవో యాదికొచ్చి రాత్రంతా ఏడ్సుకుంటనే నిద్రపోయిన. మనం గిట్ల కల్సుకుంటె ఎవరి కండ్లగిట పడేనా మన ఇజ్జతు తీస్తరు బావా! ఏం చెయ్యమంటవో బిరాన నువ్వే చెప్పు" అన్నది. గంతల్నె తల్పు సప్పుడయితె సర్రున లోన్కి ఉర్కింది. రాజయ్య తన మిద్దె మీద్కి పొయ్యిండు. గాదినం సంది లక్ష్మి శానొద్దుల్దాక కంట్లబళ్ళె. రాజన్న దినాం ఎదురు సూసిండుగాని మళ్ళీ వాళ్ళు కల్సుకున్నది దుర్గమ్మ జాతర నాడు రాతిరి గా గాలి దుమారంలనే.

గా దుర్గమ్మ జాతర్ల రాత్రి ఆకాశానికి సిల్లి పడ్డది, వానపడింది. హంగామా చేసింది. అంతా బెద్రి పొయిన్రు. ఎలిసినంక ఎవరి జాగ యాడున్నదో గాడ్కి లెంకకుంట పొయ్యిన్రు. రాజన్న లక్ష్మిని తీస్కొని తన ఠికాన కాడ్కి చేరిండు. గాయ్న తాన బ్యాటరీ ఉన్నది. దాని ఎల్గులనె లక్ష్మికి తన సెల్ల చింపి కట్టుకట్టిండు. కట్టెపుల్లలు ఒక్క తాన ఏసి మంట బెట్టిండు. ఇద్దరు తడిబట్టలు గట్టిగ పిండుకొని పెయిగాపుకున్నరు. మంటకు పెయ్యంత ఎచ్చగయ్యింది. గట్లనే రాజన్న వొళ్ళె లక్ష్మి వొరిగింది. కునుకు బట్టింది. ఇంకా జ్యాము రాత్రున్నది. రాజన్న ఆలోచన సేస్కుంట ఒక్కొక్క పుల్ల మంటల ఎయ్యబట్టిండు. సటుక్కున లక్ష్మికి మేల్కొచ్చింది. రాజన్న కండ్లల్ల కండ్లు బెట్టి సూసింది. సూపులు ఒకర్ని ఒకరు పల్కరిచ్చి మాట్లాడుకున్నయి. "లక్ష్మీ, గీవూర్ని ఇడ్సిపెట్టి యాడ్కైనా ఎల్లిపోదం" అన్నడు.

'లోకం ఊకుంటాది బావా!' అన్నది లక్ష్మి.

'ఊకోకపోతే ఏం జేస్తది. పోలీస్ పటేల్ కొడ్కు పక్కింటిపొల్ల నెత్తుకొని పొయ్యిండని కోడై కూస్తది. కూయని మనం ఇంకో ఊర్కి పొయ్యి కాయకష్టం చేసి బత్కలేమా ఏంది? చెప్పు' అన్నడు.

రాజన్న మాటకు ఎదురు జెప్పలేదు లక్ష్మి. గట్లనే కండ్లు మూస్కొని ఎదమీద వొరిగింది లక్ష్మి. గిట్ల వాళ్ళ మన్సులు కల్సినై. ఎదురుంగున్న మంటనే వాళ్ళకు అగ్ని సాక్షి అయ్యింది. మనువైపొయ్యింది.

మొగులు తెల్లబడసాగింది. వాన ఎలిసింది. కోళ్ళకూతలు ఇన్పిస్తున్నయి. లక్ష్మి మెల్లగ తన జాగకాడ్కి పొయ్యింది. గా జాతరకు గామె అమ్మ నాయ్నలు రాలే. తన దోస్తులతోని వొచ్చింది. గామె దోస్తులు దుప్పట్లు నిండ గప్పుకొని బండికింద కూసున్నరు. తన సంచిలు సామాన్లు పెట్టుకొని మళ్ళీ రాజన్న తాన్కి వొచ్చింది. రాజన్న జేబుల మస్తుగనే పైసలు న్నయి. యాడ పని దొర్కకపోయినా మూడు నాలుగు నెల్లకు సరిపోయేటన్ని రూపాలున్నయి. ఒకల్లసెయ్యి ఒకల్లు బట్కొని గాసీకట్లనే బండితోవల నడ్సుకుంట రెండు కోసులు నడ్సి రైలు టేషన్‌కు చేరిన్రు. తెల్లారినంక ఎనిమిదింటికి టేశనుకు పట్నం బొయ్యే రైలొస్తది. గా రైలెక్కిన్రు రెండు గంటలయినంక పట్నం జేరిన్రు.

హైదరాబాదుల మల్కాప్యాటల తనూరోళ్ళురన్న సంగతి రాజన్నకు తెల్సు. ఒక్కసారి వాళ్ళున్న తాన్కి పొయ్యిండు కూడ. నాంపల్లి టేషన్ దిగి రిచ్చా మాట్లాడుకొని వాళ్ళున్న గల్లీకి పొయ్యిండు. గాగల్లీల ఉండేటోళ్ళంతా కూలీనాలీ చేస్కొని బత్కేటోల్లే. చెంద్రయ్య రాజన్నను సూసి గుర్తుపట్టిండు. ఏంది పటేల గిట్లొచ్చినవ్? అన్నడు. కతంత సెప్పిండు రాజన్న. అయితెమానె. నేనున్న అని భరోస యిచ్చి వాళ్ళింటికాడ్నె ఒక చిన్న అర్ర కిరాయికిప్పిచ్చిండు. కిరాయి నెలకు పది రూపాలె. గాదినం చంద్రయ్యనే తిండి పెట్టిండు. తెల్లారి బజార్కు పొయ్యి గిన్నెలు గాసం, బట్టలు కొన్కొచ్చిండు రాజన్న. తోడుగ చెంద్రయ్య పొయ్యిండు. కొత్త కాపురం బెట్టిచ్చిండు చెంద్రయ్య. శురూల కొల్వుదొర్కతదేమోనని తిర్గిండు కాని యాడ దొర్కలేదు. చెంద్రయ్యనే తనెంబడి పన్కి తోల్కపొయ్యిండు. చెంద్రయ్య ఓ మేస్త్రీ చేతికింద పన్జేస్తడు. గామేస్త్రీకి చెప్పి పన్లె కుదిరిపిచ్చిండు. గప్పట్సంది చెంద్రయ్యతోని కల్సి పనికి పోబట్టిండు రాజన్న. లక్ష్మి ఇల్లు సర్దుకున్నది. బాసండ్లు జమాయించింది. కట్టెల పొయ్యి పెట్టింది. మబ్బుల్నె లేసి వొంటజేసి రాజన్నకు సద్ది కట్టింది. మేస్త్రీ యాడ పన్జేస్తే గాడ్కి చెంద్రయ్య ఎంబడి పొయ్యేటోడు. పొద్దుమీకి వచ్చేటోళ్ళిద్దరు. ఇద్దరు ఖుషీగనే ఉన్నరు. సంసారం నడుస్తున్నది. లక్ష్మి నెల తప్పింది. రాజన్న మస్తు కుషైండు. సెంద్రయ్య పెండ్లం కోటి దవాఖానాకు తీస్కొపొయ్యి మందులిప్పించింది. గామెనె గామెకు తోడ్గ వుండబట్టింది తల్లి లెక్క. నెలలు నిండినయ్యి. ఒకదినం నొప్పులొస్తుంటె రిక్ష మాట్లాడి దవాఖానకు తీస్కొపొయ్యింది. మొగిపిల్లగాడు పుట్టిండు. రాజన్న కుషీఅయ్యిండు. దవాఖానకెల్లి బయటికొచ్చి సుల్తాన్ బజార్ చౌరాస్తాల ఉన్న బాలాజీ రామ్‌నారాయణ దుక్నంలకెల్లి గులాబ్ జామూన్లు కొన్కొచ్చి అందర్కి పంచిండు. వారం రోజులుంచుకొని దవాఖానోళ్ళు యింటికి పంపిన్రు. చెంద్రయ్య పెండ్లం రాములమ్మనే బాలెంతకు తానం జేపిచ్చింది. పొగబెట్టింది. తెల్లారి పురుడు జేసింది. తల్లికొడ్కులు బాగనె ఉన్నరు. రాజన్న కూడ నాల్గు రోజులు పన్కిపోకుంట ఇంటికాడనే ఉన్నడు.

ఊళ్ళె రాజన్న తండ్రి చుట్టుపక్కల ఊర్లన్నీ ఎతికిండు. యాడ వీళ్ళ జాడ తెల్వలే. లక్ష్మి తండ్రి గూడ సుట్టుపక్కలోళ్ళను ఎంటబెట్కొని పల్లెలన్నీ తిర్గొచ్చిండు. గాని జాడ తెల్వక మంచం బట్టిండు. పటేలు మాత్రం పెద్ద పెద్ద ఊర్లన్నీ ఎత్కిండు. కొడ్కు పట్నంల ఉన్న సంగతి గాయ్నకు తెల్వలేదు. ఎవ్వలు కన్పిచ్చినా 'నా కొడ్కు కన్పిచ్చిండా?' అని అడ్గేటోడు. 'మేం సూళ్ళేదంటే మేం సూళ్ళేదనే'టోళ్ళే అందరు. ఒక్కరోజు పటేలు బజార్లకెల్లి పోతుంటే మల్లేషు కన్పిచ్చిండు. పట్నం నుంచి వాళ్ళ అమ్మను సూసిపోదామని వొచ్చిండు. పటేల్ను సూసి 'దండం పటేలా!' అన్నడు. 'ఏం మల్లేషా! బాగున్నవా! యాడ పన్జేస్తున్నవు' అని అడ్గిండు. 'నీకు తెల్వదా పటేలా! నీ కొడ్కు నేను ఒక్కతాననే పన్జేయబడ్తిమి. రాజన్న సెప్పలేదా?' అన్నడు. 'ఏందేంది! మా రాజన్న హైదరాబాద్లనే ఉన్నాడా? నేను దేశమంత దేవులాడబడ్తి. మంచి సుద్ది చెప్పినవుర. మావోడు ఎట్లున్నడు. గాపిల్ల ఎట్లున్నది?' అడ్గిండు.

"పటేల నీ కొడ్కు బాగనే ఉన్నడు. కొడ్కు బుట్టిండు. పిల్లగాడు బాగనే ఉన్నడు. పటేల! లచ్చిమికే కొంచెం పెయిసుస్తుండె నేనొచ్చేటప్పుడు. గిప్పుడు ఎట్లున్నదో తెల్వదు" అన్నడు.

"నువ్వు ఎప్పుడు పోతున్నవు మల్లేషు? నీ ఎంబడొస్త. ఇద్దరం కల్సిపోదం. వాణ్ణి సూడక రెండేండ్లయ్యె! యాడున్నడో! యెట్లున్నడో అని రంది బట్టివున్నం" అన్నడు పటేలు. 'మంచిది పటేల పొయ్యే ముందు చెప్త. రేపుగాని ఎల్లుండిగాని పోతమల్ల, తయ్యార్గుండు' అన్కుంట వాళ్ళింటికి పొయ్యిండు మల్లేషు.

లక్ష్మికి కాన్పు అయ్యినంక, కొన్ని రోజులు పానం బాగనే వుండె. రెండు మూడు నెల్లయినంకనే పానం కరాబైంది. రాజన్న పక్కనేవున్న ఖాన్గీ డాక్టరుతాన్కి తీస్కొపొయ్యిండు. గాయ్న సూదిగుచ్చిండు. మందులిచ్చిండు. కొంచెం నయమయ్యింది. గాని వారం తిర్గక ముందే మల్ల సుస్తయ్యింది. గా ఆర్.ఎం.పి. డాక్టరు 'సర్కార్ దవాఖానకు తీస్కొ పొండ్రి' అనిజెప్పిండు.

రాజన్న పరేషానయ్యిండు. గీనడ్మ పన్కి సరిగ్గ పోతలేదు. పైసల్కు శాన తంగున్నది. గప్పుడెప్పుడో దాపెట్టిన కొన్ని రూపాయిలున్నయి. చంద్రయ్యని పిల్సి రిక్షా మాట్లాడి దవాఖానకు తీస్కొపొయ్యిన్రు.

రోగి హాలతు సూసిన డాక్టరమ్మ దవాఖానల షరీకు సేస్కుంది. రాజన్నకు భరోసా ఇచ్చుకుంట. 'పరేషాన్‌గాకు. గామె పెయిల నెత్తురు తక్కువున్నది. గందుకే మాటి మాటికి బీమారయితున్నది' అన్నది.

'డాక్టరమ్మ. నా లచ్చిమిని నువ్వే బచాయించాలె. ఏం సెయ్యాల్నో సెప్పు' అన్నడు.

'ఏం లేదు గామెకు రక్తం ఎక్కియ్యాలే' అన్నది.

'డాక్టరమ్మ, యాడ దొర్కతది' అన్నడు.

'నీ రక్తం సరిపోతే ఎక్కిస్తం. లేకపోతే బయట నుంచి కొన్కరావాలె' అన్నది.

'అయితేమానె. గాని ముందుగాల నా రక్తం సూడమ్మ' అన్నడు.

గామె సూది గుచ్చి రక్తం తీసి పరీక్షకు పంపింది. రాజన్న గాణ్ణె కుర్సీల కూలబడ్డడు. సంటోణ్ణి రాములమ్మ ఎత్తుకొని ఆడిస్తున్నది. ఒక్క గంటయినంక డాక్టరమ్మ వొచ్చి నీ రక్తం కలుస్తలేదు. నారాయణగూడకు పొయ్యి కొన్కొరా పో అని చిట్టి రాసిచ్చింది. రాజన్న పరేషానయ్యిండు. చంద్రయ్యన్నడు, పరేషాన్ కాకు నేనున్నగదా! పోదాం పా అని ఇద్దరు రిక్షా ఎక్కి నారాయణగూడకు పొయ్యి గానెత్తురు బెంకులకెల్లి పైసలిచ్చి కొన్కొని గదే రిక్షల తిరిగొచ్చి డాక్టరమ్మ కిచ్చిన్రు. డాక్టరమ్మ గది తీస్కొని మళ్ళీ పరీక్ష చేపిచ్చింది. సరింగనే యిచ్చిన్రు అని చెప్పింది. గటెన్కాల గాసీసా లక్ష్మి నరంల సూది గుచ్చి పెట్టింది. గాసీసాను యాలాడదీసింది. బొట్టు బొట్టు రక్తం లక్ష్మి పెయ్యిలకి పోబట్టింది. పక్కన స్టూలు మీద రాజన్న కూసున్నడు. చంద్రయ్య రాములమ్మ పిల్లగాణ్ణెత్తుకొని ముచ్చట్లాడుకుంట బయట వరండాల కూసున్నరు. దవాఖానల అంతా గడబిడ ఉన్నది. జనం రోగులు రిచ్చాల్ల వొస్తున్రు పోతున్రు.

లక్ష్మి కండ్లల్ల నీళ్ళు గిర్రున తిర్గినయి. రాజన్న మొకం సూస్కుంట కండ్లల్ల నీళ్ళు తెచ్చుకున్నది.

"లక్ష్మీ! ఏడ్వకు. మన్సులన్నంక రోగాల్రాకుం టుంటయ్యా? డాక్టరమ్మ మంచిది. బిరాననే తక్కువ అయితదని చెప్పింది' అని సముదాయించిండు.

"పాపిష్టిదాన్ని. నువ్వు ఇంకొకర్తెను లగ్గం జేస్కుంటే గీకష్టాలొచ్చెయ్యిగావు బావా! నా కోసం నువ్వు నీబత్కు పాడు జేసుకుంటివి."

'గవేం మాటలు లక్ష్మీ! గిప్పుడేమయింది. కొన్రోజులు కష్టాలు తప్పవు. మన ప్రేమను ఎవ్వల్లు గూడ కాదన్రు. మన నిషాని మన బాబే గదా! నువ్వేం ఫికర్ సెయ్యకు. ముందుగల ముందుగల అంత సర్దుకుంటది. మనకు కష్టాలు పొయి మంచి రోజులొస్తయి. భగవంతుని మీద భరోస పెట్టు' అన్నడు.

'మనం ఊరిడ్సి లేచొచ్చిన సుద్ది ఊరంత తెల్సిపొయ్యుంటది. మల్ల మనం ఇజ్జత్ లేకుంట తిర్గి ఏం మొగం పెట్కొని మనూర్కి పోతం? నా కోసం నువ్వు అందర్నిడ్సిపెట్టి కష్టపడబడ్తివి. మీద్కెల్లి గీపోరగాడు బుట్టె. వీడు పుట్టకపోయ్నా బాగుండె' అనుకుంట ఏడ్వబట్టె రాజన్న కండ్లు దుడ్సిండు.

"అరెరే, గింత సిన్న మాటకే గింత గనం ఏడ్వాల్నా లక్ష్మీ. రాములోరెంబడి పొయ్యి సీతమ్మ బాదలు బళ్ళేదా! గామె ఎప్పుడన్న ఏడ్సినాది" అన్నడు. నెత్తురు సీసా కాళీ అయ్యింది. నర్సమ్మ వొచ్చి కాళీ సీసా తీసేసింది. గట్లనే లక్ష్మికి నిద్రబట్టింది. రాజన్న లేచొచ్చి చంద్రయ్య తాన కూసున్నడు. సంటోడు రాములమ్మ ఒళ్ళె నిద్రపొయ్యిండు.

మల్లేషు పటేల్ను తోల్కొని మల్కాప్యాటల తామున్న కాడ్కి తీస్కొచ్చిండు. ఇంటికి తాలం ఉన్నది. పక్కనుండే చంద్రయ్య రాములమ్మలు కూడా లేరు. "యాడ్కి బొయ్యిన్రబ్బా!" అనుకుంటుంటే మల్లయ్య కన్పిచ్చిండు. ఉర్కుత పోయి మల్లయ్యను కల్సిండు. మల్లయ్య పటేల్ను సూసి దండం పటేల! యాడ్కివొస్తివి అన్నడు. మల్లేషు సంగతంతా జెప్పిండు. 'అయ్యో పాపం!' అన్నడు మల్లయ్య. దవాఖానలున్నరు ఈయాల్టికి నాల్గొద్దులాయె అన్నడు.

'యా దవాఖాన్ల షరీకు జేసిన్రు' అని అడ్గిండు మల్లేషు.

'కోటి దవాఖాన్ల' అన్నడు మల్లయ్య.

ఎంబడే రిక్ష మాట్లాడుకొని ఇద్దరు కోటి దవాఖానకొచ్చిన్రు.

రిచ్చాయనకు పైసలిచ్చి లోపల్కి పొయ్యిన్రు. ఎదురుంగ చంద్రయ్య, రాములమ్మ కన్పిచ్చిన్రు. పటేల్ను సూడంగనే దండం పెట్టి నిలబడ్డరు.

'యాడున్నది లక్ష్మి మళ్ళ మావోడు' అని అడిగిండు.

'లోపల వార్డులున్నరు' అన్నడు చెంద్రయ్య.

"వీడేనా నా మన్మడు" అని ఎత్తుకొని ముద్దుపెట్టుకున్నడు.

గంతల్నె రాజన్న బయటికొచ్చి తండ్రిని సూడంగనే కండ్లల్ల నీళ్ళు తిర్గినై. ఉర్కుత పోయి కాళ్ళమీద పడ్డడు. "మాఫ్ చెయ్యి నాయ్నా" అన్నడు.

కొడ్కును లేపి కావులిచ్చుకొన్నడు పటేల్. ఏడ్వకు ఏం పర్వాలేదు. పోదం పదుండ్రి మనూర్కి అన్నడు.

లక్ష్మికి పెయి శానసూస్తుండె. గిప్పుడు నయమైంది. నిన్నట్సంది బువ్వ తింటున్నది. ఇప్పుడు పెద్ద డాక్టరొస్తడు. గాయ్న సూసినంక ఇంటికి పంపిస్తరంట అన్నడు రాజన్న.

పెద్ద డాక్టరొచ్చి చూసి ఇగ ఇంటికి పోవచ్చు అని సీటీ రాసిండు. మందులు కొన్కొని వచ్చిండు రాజన్న. లక్ష్మి మంచమ్మీదికెల్లి దిగొచ్చి పటేలు కాళ్ళ మీద పడ్డది. పటేలు నెత్తిమీద చెయ్యిబెట్టి ఆశీర్వదించిండు. లేబట్టి ఏడ్వకు అన్నడు. పోదం పాండ్రి ఇగ ఊళ్ళె మన ఇంట్లనే సుకంగ ఉందురుగని. నువ్వు ఇల్లు సంబాళిస్తే రాజన్న పన్లు జూస్కుంటడు. నేను మనుమంతోని ఆడుకుంట అన్నడు. సంటోన్ని ఎత్తుకొని "ఏం పేరు పెట్టిండ్రు" అడిగిండు.

"చిన్న పటేలు" అన్నడు సెంద్రయ్య.

అందరు ఒక్కపాలె నవ్విన్రు.

గాడ్కెల్లి మల్కాప్యాటకు వొచ్చి తలెముంతలు, పెట్టె సామాన్లు మూట గట్కొని గౌలీగూడ బస్సు టేషన్ కొచ్చిన్రు. ఎర్రబస్సెక్కి ఊరి తోవ బట్టిన్రు.

లోకం మీద గాయ్నకు పట్టరాని కోపమొచ్చింది. గీ దునియాలా గీ కులం కట్టుబాట్లు ఎప్పుడు పోతయ్యో! అనుకున్నడు. అసలు గీ కులాలు ఎవడు కనిపెట్టిండో వాన్ని పట్కొని తన్నాలె.

రాజన్న లక్ష్మిని హమెషా తన దాన్ని సేస్కోవాలనుకున్నడు. కాని ఎట్ల? లక్ష్మి వేరే కులం పిల్ల. మీదికెల్లి ఇంటి పక్క పిల్ల. ఎన్నో వొద్దులు ఆలోశన చేసిండు. ఏం చెయ్యల్నో తోస్తలేదు. ఆఖర్కి గుండె గట్టిగ జేస్కొని ఉండబట్టలేక తండ్రికి జెప్పిండు. తండ్రి గామాటిని అగ్గిమీద గుగ్గిలం అయ్యిండు.

ఊళ్ళె రాజన్న తండ్రి చుట్టుపక్కల ఊర్లన్నీ ఎతికిండు. యాడ వీళ్ళ జాడ తెల్వలే. లక్ష్మి తండ్రి గూడ సుట్టుపక్కలోళ్ళను ఎంటబెట్కొని పల్లెలన్నీ తిర్గొచ్చిండు. గాని జాడ తెల్వక మంచం బట్టిండు.

'మనం ఊరిడ్సి లేచొచ్చిన సుద్ది ఊరంత తెల్సిపొయ్యుంటది. మల్ల మనం ఇజ్జత్ లేకుంట తిర్గి ఏం మొగం పెట్కొని మనూర్కి పోతం?




పరిమళించే పూల పొదల మధ్య,
పర్వతాల పలుకుల మధ్య,
ప్రకృతి పరవశంతో మెరిసిన భూమి
ప్లాస్టిక్ పీల్చే పీడనే నేటి చిరునామా .
పరిరక్షణ పాఠం మరచిన మనిషి,
అవివేకంతో ప్లాస్టిక్ మబ్బుల నీడలో నడుస్తూ
జీవదయను తాకట్టు పెట్టెను మతి మరచి.
ప్లాస్టిక్ భూతం కోరలు చాపింది,
నదులను మూటగట్టి చెట్లపై దాడి చేసి
పక్షుల ప్రాణాలకు ముప్పు తెచ్చి
సర్వే మానవాళిని ఖతం చేస్తుంది.
ఒక పిలుపు
మన భూమి వెనకడుగు వేస్తోంది,
ఒక హెచ్చరిక
నీ మౌనం ముంచుతుంది భవిష్యత్‌ను.
పరిశుభ్రత కోసం కాదు ఈ ప్లాస్టిక్ ప్రయాణం,
ప్రళయం పిలవటానికి ఇది
చిన్న చప్పుడు మాత్రమే!
ఇప్పుడు లేవాలి, కళ్ళు తెరవాలి,
ప్లాస్టిక్ భూతాన్ని పారద్రోలాలి,
పచ్చని పల్లకిలో భూమి మళ్లీ ఊయలాడాలి.
జీవజాలానికి జీవం నింపే ప్రకృతిని
ప్రేమిద్దాం– పరిరక్షిద్దాం
–పరిపాలిద్దాం!

–డి. అమీర్
9642480702





## పర్యావరణంపై ప్లాస్టిక్ భూతం

దేనినైనా నాలో కరిగించుకొని
మానవాళికి తిరిగి ఉపయోగపడేలా
సాయపడుతున్నా...
కానీ నిన్ను నాలో కలుపుకోవాలంటే
సహస్ర సంవత్సరాలు కూడా సరితూగట్లే....
పోనీ నిన్ను అగ్నికి
ఆహుతి చేద్దామంటే
టాక్సిక్ వాయువులను వదిలి
నా బిడ్డల పాలిట
శ్వాసకు శాపమవుతున్నావు ...
మూగజీవాల మనుగడకు
ఆటంకమవుతున్నావు...
భూసారాన్ని తగ్గించి,
నీటి కాలుష్యాన్ని పెంచి
జీవవైవిధ్య నష్టానికి
కారణమవుతున్నావు...
నిషేధమే పరిష్కార మార్గం
మేల్కొనకపోతే భవిష్యత్ తరాలకు తీరని నష్టం....
అందుకే ఇక అంతరించిపో ఓ ప్లాస్టిక్ భూతమా...
సకల జీవకోటి జీవితాల్లోకి
వచ్చిన పెను భూతమా....

–నారోజు కవిత
ప్రభుత్వ ఉపాధ్యాయురాలు
ప్రాధమిక పాఠశాల.
దంతాన్ పల్లి, శివంపేట్, మెదక్ జిల్లా.



# గోపిగారి నానీల గొప్పతనం

**'నానీ'ల ప్రక్రియలోకి తనకలం పాదం మోపడంలో జరిగిన ప్రయత్నం 'అక్షర నేత్రాలు' కవితా సంపుటి వెలువరించిన కవయిత్రి ఎన్.లహరి నానీల గురించి తన అనుభవాలు, అనుభూతుల వివరణ ఈ వ్యాసం.**

నేను ఇప్పటికే "అక్షర నేత్రాలు" అనే కవితా సంపుటిని వెలువరించాను. నాకు ఈ 'నానిల' ప్రయాణాన్ని ఆరంభించవలసిందిగా వీటి 'సృష్టికర్త'.. నాకు స్వయానా పెదనాన్న గారైన డా.ఎన్. గోపిగారు చెప్పడం జరిగింది. అప్పటిదాకా అడపాదడపా చదవడమే తప్ప.. ఎప్పుడూ రాసే ప్రయత్నమైతే చెయ్యలేదు. కానీ పెద్దనాన్నగారి మాట కోసం, తప్పక రాయాలని నిర్ణయించుకున్నాను. వీటిని రాస్తున్న క్రమంలో.. ఎన్నిసార్లు నిర్దాక్షిణ్యంగా ఇవి కొట్టివేతలకు గురయ్యాయో.. ఒట్టి మాటల్లో అభివర్ణించలేను." ఇలా అధ్యయనం లేకుండా రాయడం వల్ల ఏ రకమైన ప్రయోజనమూ ఉండదు. లోలోతుల్లోకి వెళ్లి, మూలాలను స్పృశించి, అనుభవాలను అనుభూతుల రూపంలో పలవరించి కలవరిస్తూ రాయడంలో ఉండే.. ఒక రకమైన మమేకస్థితి.. జీవన లోతుల్ని తడుముతుంది." అనే ఒక అపురూపమైన సలహా నన్నొక నానీల కవయిత్రిగా ఇవాళ మీ ముందు నిలబెట్టింది.

దీని వెనుక ఒక రాక్షస సాధన.. కఠోర స్థితిలోంచి రూపుదిద్దుకొని నన్ను నేను ఆత్మావిష్కరణ చేసుకునే దిశగా అడుగులు వేయించింది. ఆ తర్వాత 'నాని' లపై వచ్చిన మా పెద్ద నాన్నగారి రెండు పుస్తకాలు.. ఇంకా చాలా మంది రాసిన ముందుమాటలూ, చదివి అధ్యయనం చెయ్యడంలో నాకో కొత్తచూపుని ప్రసాదించింది. అంతే.. లోతుగా విశ్లేషించుకుంటూ.. ఒక తార్కిక స్పృహతో చదవడం మొదలు పెట్టాను. అలా గోపిగారి పుస్తకాల్ని నానీల రూపంలో చదువుతున్నపుడు.. ఈ నానిల్లోని గొప్పతనం, మార్మిక స్పృహ, ధ్వని వ్యక్తీకరణ అనుభవ పూర్వకంగా ఒంటబట్టింది. అప్పుడు సరికొత్త ఆలోచనలు నాలో స్ఫురించి పరోక్షంగా నన్ను సానబెట్టేవి. అంతర్మథనానికి గురిచేసి, మానసిక సంఘర్షణ రాపిడిలో చైతన్య పూరితమైన భావాలను సృజనాత్మక కోణంలో రాయడం నేర్పాయి. ఈ విషయంలో తెలిసిన సాహితీమూర్తుల సలహాలూ, సంప్రదింపులూ, మెలకువలనూ ఆకళింపు చేసుకునేలా చేశాయి. ఇక్కడ ఉన్న పాఠకప్రియులకు ఈ నానీల స్పృహ లేదనికాదు. చాలామందికి వీటి నిర్మాణరూపం, అభివ్యక్తీకరణ తెలియదని అనుకోను. ఎలా రాయాలో.. ఏ రీతిలో రాయకూడదో అనే ఒక డోలాయమానమైన ఊగిసలాట లోంచి, ఆధునిక సూక్ష్మ కవితారూపంగా ఎలా రూపాంతరం చెందిందో.. ఇక్కడ కొన్ని అనుభవాల రూపంలో మీతో పంచుకుంటాను.

నిజంగా నానీలు నేర్చుకోవాలనే తపన ఉన్నవాళ్ళకి.. నేను చెప్పే ఈ కొద్దిపాటి విషయాలూ.. కొద్దిలో కొద్దిగానైనా రచనాపరంగా సహాయం చేస్తాయని భావిస్తున్నాను. తొలిదశలో నానీలు నేర్చుకునే క్రమంలో.. కొన్నిసార్లు నిద్రలో కూడా కలవరించేదాన్ని. ఈ అపస్మారకమైన ఒక మమేక స్థితిలోంచే గొప్పగొప్ప నానీలు అంతర్లీనంగా నాలో ఊపిరి పోసుకునేవి. పొద్దుట నిద్ర లేచేసరికి వీటిలో ఒకటి కూడా స్ఫురణకొచ్చేవి కావు. గుర్తుపట్టి తిరిగి రాసేంత వెసులుబాటు ఉండేది కాదు. అదంతా ఒక నిద్రాణమైన మౌన సంయోగ స్థితి లోంచి అపరిచితంగా జరిగే రోజువారీ యాంత్రిక దినచర్యకు పరోక్ష ఉదాహరణ మాత్రమే. ప్రత్యక్ష జీవితానుభవాలను దృష్టిలో పెట్టుకుని చూస్తే జీవన వాస్తవిక స్థితికి, చుట్టూ అల్లుకుంటున్న సహజ సంఘటనలనూ, అనుభూతులనూ గాఢ పరిశీలనలోంచి అధ్యయనం చేసి రాసినవే. దూరంగా ఎక్కడో, ఏదో జరిగే ఒక అంశం మీద రాసేదానికంటే.. కళ్ల ముందు జరుగుతున్న విషయాలనే నానీలుగా మలుచుకునేదాన్ని. నిజానికి ఇది చాలా తేలికైన పద్ధతి. విషయం మీద పట్టువుంటే ఈ నానీల అల్లిక చాలా తేలిక.

ఆధునిక సూక్ష్మ సాహితీ ప్రక్రియల్లో ఈ నానీ కవితాప్రక్రియకు ఒక విశిష్టస్థానం ఉంది. నాలుగు వరుసల నియమంతో.. 20-25 అక్షరాల మధ్య సాగించే ఈ పద పాద నియమం విలక్షణమైనది. వీటిలో మొదటి రెండు పాదాలు ఒక అంశాన్ని ప్రతిపాదిస్తే, మిగిలిన కింద రెండు పాదాలు ఒక రకమైన పంచ్ లాగా, చరుపులాగా ముక్తాయింపుతో కూడిన భావ అన్వయం ఉండాలి. కొసమెరుపులాంటి ముగింపుతోనూ అసలు అర్థాన్ని ప్రతిబింబించే భావ సమన్వయం తొణికిసలాడాలి. ఇలా అన్వయించి రాసే పద్ధతిలో ఒక అంతర్లీనమైన జీవన తాత్వికత ఉట్టిపడుతుంది. నానీలు అనే పేరు చిట్టి అక్షర వరుసకు ప్రతిబింబ సూచికగా చెప్పుకోవచ్చు. ఒక పెద్ద భావ సారాంశాన్ని చిన్నపాటి వాక్యాల కుదింపులో అక్షర నియమానికి ఒదిగించి రాయడం కొన్నిసార్లు కత్తిమీద సామే. కానీ సానబెట్టి, సాధన చేసి, శ్రద్ధపెట్టి అర్థవంతంగా రాయగలిగితే ఆ కూర్పులో ఉన్న నిర్మాణ రీతే వేరు. మినీ కవితతోనో, హైకూతోనో దీనిని పోల్చి చెప్పడం సరి కాదు. నానీ అంటే ఉన్న విషయాన్ని నాలుగు వాక్యాల్లో ఇమిడ్చి చెప్పాలి. ఈ నానీల్లోని అంశాలు పూర్తిగా భిన్నంగా ఉంటాయి. ఎందుకంటే నేనొక సాధారణ గృహిణిని. మా ఇంటి చుట్టూ అనేక విషయాలు పెనవేసుకుని ఉంటాయి. వీటిని నాకు అనుకూలంగా మలుచుకుని వస్తుపరంగా 'నానీ'గా రాయడానికి ప్రయత్నించేదాన్ని.

మా నాన్నగారు నా పెళ్లి సమయంలో ఇచ్చిన టీవీ ఒక నానికి కవితా వస్తువైంది. అప్పట్లో దాని ఖరీదు, విలువ చాలా ఎక్కువ. కానీ మారుతున్న ఈ రోజుల్లో 'స్మార్ట్ టీవీ' చూడటానికి చాలా చిన్నదిగా అనిపిస్తుంది. అలా దాని నుండి పుట్టిన ఒక 'నానీ'ని ఇప్పుడు ఒకసారి మననం చేసుకుందాం.

**"మా పాత టీవి**
**నాన్న బహుమతి**
**తీయలేను**
**పెట్టుకోలేను"** అని అంటున్నపుడు కలిగే ఒక మానసిక బాధ ఉద్వేగభరితంగా మారినపుడు ఎలాంటి అంతర్గత అలజడిని సృష్టిస్తుందో ఈ నానీని పరిశీలిస్తే అర్థమవుతుంది. దానిని ఉన్న చోట నుండి తీయలేక.. అలా అని కాలం చెల్లిపోయాక దానిని యథాస్థానంలో ఉంచలేక పడే ఒకానొక మానసిక అవస్థే ఈ నానీకి ప్రత్యక్ష ప్రేరణ. అలాంటి మింగుడు పడని ఒక ఉద్వేగభరిత సందర్భాన్ని అక్షరీకరిస్తూ రాసిన నాని ఇది.

ఇలా గమనిస్తూ పోతే చాలా నానీలు ఉన్నాయి. ఒక సాధారణ అంశాన్ని అసాధారణ అంశంగా చిత్రీకరించి, నానీ రూపంలో ఎలా అక్షరీకరించాలి అనే విషయాన్ని మరికొన్ని 'నానీ'ల ఉదాహరణలతో తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.

**"పేదరికమే**
**గొప్ప చిత్రకారిణి**
**అమ్మ చీరపై**
**చిరుగుల చిత్రాలు"** అని అంటున్న పుడు చివికిన బీదరి కంలోంచి ఒక కళాత్మక సౌందర్య దృష్టి సహజ దృశ్యచిత్రంగా ఒదిగిపోతుంది. పేదరికాన్ని కూడా ఒక వ్యంగ్య స్పృహతో నానీగా మలచడంలో లోలోపట గూడుకట్టిన అంతర్గత వేదన ఆవేదనగా తొంగి చూస్తుంది.

ఇలాంటిదే మరొక జీవనస్పృహ ఉట్టిపడే నాని. వాస్తవాన్ని బతుకు విషాదంగా పిండి నిరాశగా ఆరేస్తుంది.

**"కల్లంలో రైతు**
**కలలు ఆరబెట్టాడు**
**వర్షం**
**కల్లలు చేసింది"**

ఈ యదార్థదృశ్యం ప్రతి రైతు జీవితంలో ఉన్న ఒక కఠోర జీవన వేదన సత్యమే. మానసిక సంఘర్షణకి అద్దం పట్టే శ్రమజీవి కష్ట నష్టఫలిత పర్యవసాన ప్రతిరూప దిగులు చిత్రమిది. చేతికందాల్సిన సమయంలో పంట వర్షపు నీటిలో తడిసి.. మునిగి గంగ పాలవుతుంటే, అప్పటిదాకా పడ్డ కాయకష్టం ఉస్సూరుమంటూ నిట్టూర్చి.. కొండంత ఆశల బతుకుల్లో విషాద నిరాశలనే పరుస్తుంది. కన్న కలలు కల్లలై పస్తులతో ఆకలిమంటల్నే చివరికి మిగుల్చుతుంది. ఈ నిస్సహాయ స్థితిని అనుభవైకవేద్యంగా కళ్ళకు కట్టినట్లుగా నిరూపించడమే ఈ భౌతిక విషాద వాస్తవికత.

ఇంకోచోట సహజత్వానికి విరుద్ధంగా చోటుచేసుకుంటున్న నవనాగరిక పరిణామాల్ని చమత్కార ధోరణిలో వ్యక్తపరచడానికి ప్రయత్నించాను.

**"అతడు కుమ్మరి**
**ఫ్రిజ్జులో నీళ్ళే తాగుతాడు**
**ప్రపంచీకరణ**
**మాయాజాలం"** అంటూ వర్తమాన కులవృత్తికి దూరంగా విలాసవంతమైన జీవితానికి ఎలా బానిసగా మారాడో ఈ చిన్న నాని ఉదాహరిస్తుంది. వాస్తవంగా చెప్పాలంటే.. వృత్తిపరంగా కుమ్మరే చల్లదనాన్ని పంచే నీళ్ల కూజాను, కుండను తయారుచేసి వేసవితాపం నుండి సేదతీరుస్తాడు. అటువంటి పూటకూలీ వృత్తి కళాకారుడు చేతివృత్తులకు దూరంగా జరిగి, ఫ్రిజ్జులో తాగే నీటికి బానిసైపోతూ, ఖరీదైన ఆధునిక విలాసజీవితానికి అలవాటుపడే సంస్కృతి ఈ ప్రపంచీకరణ మాయాజలంలో ఒక భాగంగానే గుర్తించాలి. ఇది సామాజిక జీవన వాస్తవికతకి అద్దం పడుతుంది.

ఇంకా ఇలాంటి బహుముఖ పార్శ్వాలను తడుముతూ కొత్తకోణాలను ప్రతిబింబించే అంశాలను ఎన్నింటినో ఈ నానీల రూపంలో పలవరించవచ్చు.

**"కరెంట్ పోయినప్పుడు**
**ఆమె నవ్వింది**
**ఇప్పుడు ఆలస్యమైనా**
**పర్వాలేదు"** అని చెప్పడంలో.. పైకి కనీకనిపించకుండా దాచే ఒక అంతర్లీన మార్మిక ధ్వని ఏదో ఇందులో ప్రతిధ్వనిస్తోంది. కరెంట్ పోయిన తర్వాత అలుముకున్న చీకట్లో ఆమె నవ్విన నవ్వే ఒక వెలుగుదీపంగా చుట్టూ కాంతిని ప్రసరింపజేసిన తీరును ఇక్కడ కవిత్వమయం చేసే చమత్కార ధ్వనిగా భావించవచ్చు. ఈ భరోసాలోంచే ఆలస్యమైనా పర్వాలేదన్న స్పృహను ఈ నానీ ఆవిష్కరిస్తోంది.

మరోచోట చెప్పినట్టుగా విలక్షణత ఉట్టిపడే భావ సౌందర్యాన్ని నర్మగర్భంగా పలికే స్వభావాన్ని చిత్రీకరిస్తుంది.

**"అమూల్యమైన పుస్తకాలు**
**ఇంటినిండా**
**అతడి కంటే**
**ధనవంతుడెవరు"** అనే భావన పుస్తకాలను విజ్ఞానానికి ప్రతీకగా చేసి, మేధోపరమైన జ్ఞాన సముపార్జనని ఆలోచనల రూపంలో విలువైన ధనసంపదగా భావించి పెద్దపీట వెయ్యడం ఒక సృజనాత్మక లోచూపుకి కొత్త ద్వారాలు తెరవడం లాంటిదే. ఈ వైవిధ్యపూరితమైన ఊహే మస్తిష్కంలోని మేధోమథనానికి ఒక గీటురాయిగా పేర్కొనవచ్చు.

సున్నితమైన అంశాలను గాఢతతో పెనవేసుకున్నపుడు మమేకమయ్యే మానసిక స్థితిలోంచి ఊపిరిపోసుకునే కవిత్వం చాలా సహజంగా నిర్మలంగా ఉంటుంది. ఈ సత్యాన్ని తేటతెల్లం చెయ్యడానికి బాల్యాన్ని ఒక ప్రతీకగా చేసుకుని ఆ సందర్భాన్ని కవిత్వమయం చేసే దృశ్యాన్ని ఇప్పుడు మరో నానీలో పరిశీలిద్దాం.

**"స్వచ్ఛమైన**
**నవ్వు దొరకలేదా**
**పసివాడి కేసి**
**చూడు చాలు"** అంటూ ఆపేయడంలో ఉన్న ఆంతర్యం సహజ వాస్తవికతలో ఉన్న స్వచ్ఛదనాన్ని ఒక పసివాడి నిర్మలమైన చిరునవ్వులోంచి దర్శించే తత్వాన్ని తాత్విక స్పృహతో మమేకం చేస్తుంది. సాధారణ విషయాన్ని కూడా అసాధారణ రీతిలో అతి సౌమ్యంగా చిత్రించే తపనను ఇందులో వాస్తవికదృష్టితో చూస్తాం. ఈ ఒడుపే పాఠకుడి మనసుని చాలా సన్నిహితంగా తడిమి, నానీలోని లోచూపుతో ఆకట్టుకునే ప్రయత్నం చేస్తుంది.

ఇలాంటి ఆహ్లాదభరితమైన మరో కోణాన్ని అందిపుచ్చుకోవడంలో ప్రదర్శించే నేర్పరితనాన్ని ఇక్కడ మళ్లీ మరో నానీలో చూడవచ్చు.

**"మా ఇంటికి**
**అతిథిగా కొత్త కుండ**
**వేసవి మొత్తం**
**చల్లదనమే"** అని వ్యాఖ్యానించడంలో.. మండు వేసవిలోని ఉక్షశక్తిని అంతా, అతిథిగా వచ్చిన కుండ రూపంలోని నీటి చల్లదనంతో దాహార్తిని తీర్చి, వేసవిని కూడా శీతలమయంగా చేసే పరుసవేది విద్యని ఈ నానీ ప్రదర్శిస్తుంది. వస్తువులోని సహజగుణాన్ని గుర్తించి దాని లక్షణం ఆధారంగా మూల స్వభావాన్ని కవిత్వమయం చేసి చెప్పడం దీని ప్రత్యేకత.

ఇలా చెప్పుకుంటూ పోతే నడిచే కాలమే 'నానీ'లమయంగా మారిపోతుంది. వీటి కుదుపుల తాకిడికి తాదాత్మ్యం చెందే ప్రతీక్షణమూ ఉద్వేగభరితమైన సున్నితదృశ్యాలను కవితాత్మకంగా ఆవిష్కరించే ప్రయత్నం చేస్తాయి. ఇందులో తీసుకున్న ప్రతివస్తువూ మన చుట్టూ అందుబాటు లో వున్న పరిసరాల్లోంచే స్వీకరించి.. పలు సందర్భాల్లోంచి వ్యక్తిగత దృష్టితో చూసి.. స్వీయ అనుభవాలతో అనుభూతులుగా ఆవిష్కరించే తపనలోంచి పుట్టుకొచ్చినవే. కాకపోతే వీటిని చాలా నిశితమైన దృష్టితో అధ్యయనం చెయ్యాలంతే. చూసే ప్రతి పార్శ్వనీలోనూ సృజనాత్మకత ఉట్టిపడే మమేకత్వాన్ని ప్రదర్శించాలి. మస్తిష్కంలో విచ్చుకునే ఆలోచనలకు కొత్తచూపుతో పదునుపెట్టాలి. దార్శనిక స్వభావాన్ని ఆకళింపు చేసుకోవాలి. వీటన్నింటితోపాటు స్థితప్రజ్ఞతను చాటిచెప్పే మానసిక లోతుల్ని సమదృష్టితో పరిశీలించే నేర్పు, ఓర్పు, తపన, వేదన, అవగాహన సమపాళ్ళలో మిళితం చేసి హృదయావిష్కరణ చెయ్యాలంతే. తగిన కృషితో సాధన చేస్తే సాధించలేనిదంటూ ఏదీ లేదు ఈ లోకంలో.

వీటితోపాటు లోతైన విమర్శనాత్మక అధ్యయనం తప్పని సరి. అలా సానబెట్టుకుంటూ వచ్చిన ఊహల్ని ఒకచోట కుప్పగా పోసి అక్షరసాధనతో లక్ష్యానికి గురిపెట్టాలంతే.. నానీలు వాటంతటవే చిన్నపిల్లల్లా పరిగెత్తుకుంటూ వచ్చి, మన చుట్టూ, మనసు చుట్టూ మౌన ప్రదక్షణ చేస్తాయి. వీటిని శబ్దశక్తితో అక్షరమానం చేసి మన కలల్ని సాకారం చేసుకోవాలి.

**లోతైన విమర్శనాత్మక అధ్యయనం తప్పని సరి. అలా సానబెట్టుకుంటూ వచ్చిన ఊహల్ని ఒకచోట కుప్పగా పోసి అక్షరసాధనతో లక్ష్యానికి గురిపెట్టాలంతే..**



**-ఎన్. లహరి**
9885535506

# మంచి కథలను మరోసారి మననం చేసుకుందాం

**పుస్తక సమీక్ష**

సమాజోన్నతికి పనికివచ్చే మంచి మాటలను పదే పదే మననం చేసుకోవాలి. ఆచరించాలి. ఆచరింపచేయాలి. సమాజం మీద ఎనలేని ప్రేమ గల ఎన్.కె. బాబు అదే చేస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల కథకులను ఆహ్వానిస్తున్నారు. లోగడ ప్రచురించబడిన మంచి కథలను మరోసారి తన సంపాదకత్వంలో ప్రచురించి, మంచి అనే పరిమళాన్ని వెదజల్లుతున్నారు. ఔత్సాహిక, వర్ధమాన కథకులను ప్రోత్సహిస్తూ, వారిలో ఆత్మ విశ్వాసాన్ని పెంపొందిస్తున్నారు. గత8 ఏళ్ళుగా 'నాకు నచ్చిన నా కథ-1234, కథా పరిమళాలు, కథా సౌరభాలు, కథాకుసుమాలు, ఇప్పుడు ఈ 'కథా లోగిలి' తో మన ముందుకు వచ్చారు.

ఈ సంకలనంలో 45 కథలున్నాయి. 45 గురు కథకుల పరిచయాలు ఉన్నాయి. క్రొత్త పాతల కథకులతో క్రొమ్మెరుంగులు చిమ్మే ఈ కథల్లో వైవిధ్యము ఉంది. గ్రామీణ జీవితాలు, మధ్య తరగతి, అంతకంటే మరో రెండు మెట్లు క్రిందనున్న అభాగ్యులు, రాబందుల చేతుల్లో కబళించబడే ఆడతనం, ఎకరం నేల కబళించాలని చూసే తోడేళ్ళు, సర్వ శక్తులు ఒడ్డి రక్షించుకో చూసే బడుగు బ్రతుకులు, సెజ్ (special Economic zone) లలో కొట్టుకు పోయే చిన్న కమతందారులు, ప్రణయ నిరీక్షణలు, విరహంతో సలసలా కాగే ప్రేమలు, నీళ్ళులేని ఇటిక్యాల పాడా గ్రామం, అది అలా ఎందుకు అయ్యిందో



**ప్రతులకు:** ఎన్.కె.బాబు
24-8-1, సమీరా రెసిడెన్సీ
విజయనగరం-535 002.ఏ.పి
సెల్:8977732619

వివరించట, గిరిజనులు గంజాయి స్మగులర్లుగా ఎందుకు అవుతున్నారో వివరించటం, గవర్నమెంటు అనే భూతానికి తన భవనాన్ని అద్దెకిస్తే, అటు బాడుగరాక, ఇటు శిధిలావస్తకు చేరిన తన భవనాన్ని చూడలేక, రియల్ ఎస్టేట్ ధరలు పెరిగిన నేపథ్యాన కబళింపచూసే ఊరి పెద్దలు, అధికారుల సహకారం, గాంధీ హాస్పిటల్, డాక్టర్ల సమ్మె గాలిలో కలుస్తున్న ప్రాణాలను ఆదుకోవాలన్న సదుద్దేశం గల డాక్టర్, సానిదాని పట్ల కూడా మానవత్వం ప్రదర్శించే ఆఫీసర్- కథా లోగిలిలో నేటి ప్రపంచం ఉంది. నాలుగేళ్ళ క్రితం ప్రపంచాన్ని వణికించిన కోవిడ్ ప్రసక్తీ ఉంది.

తెలంగాణ తెలుగు సౌరభం, రతనాలు పండిన రాయలసీమ, భాషా మాధుర్యం, పాలమీగడలాంటి కోనసీమ లేలేత కొబ్బరి తీపి-వెరసి-ఈ 'లోగిలి'లో చిన్నపాటి ప్రపంచమే ఆవిష్కరించబడింది. సంపాదకులు శ్రీ బాబుగారు చెప్పినట్లు- పి.హెచ్.డి. థీసిస్‌కు పనికి వచ్చే ప్రపంచమే ఉంది ఈ కథల్లో.

సలీం, దొండపాటి కృష్ణ, కూర చిదంబరం, ఆర్‌సికె రాజు, సంఘమిత్ర, జగదీశ్ మల్లిపురం లాంటి కాకలు తీరిన కథా యోధులు కనిపిస్తారు. సృజన వావిలపల్లి లాంటి ఇప్పుడిప్పుడే కథా కలం పట్టిన ఉత్సాహవంతులు ఉన్నారు.


ఇక కథల్లో కనిపించే మంచి సందేశాల ప్రస్తావనకు వస్తే బంగారం లాంటి బాల్యం, గడపాల్సిన రోజుల్లో తల్లీ తండ్రి మరణించారు. ఇరుగు పొరుగులు ఎన్ని రోజులు ఆదుకుంటారు! దీనికి తోడు 'చిన్న మ్యోరు' ఒళ్ళంతా తొడిగేసి పొక్కులు కళ్ళలోకి కూడా పాకేసాయి. నాలుగు రోజులుగా తిండి లేదు. ఎవరో మహాతల్లి జాలి తలచి నిన్నటి పాసిపోయిన అన్నం వేస్తుంది.

తీరా తినబోతుండగా కాలువలో కొట్టుకు పోతూన్న తన ఈడు అనాధను ఆదుకుని, తన అన్నం అంతా ఇచ్చేసి రాముడి కథ 'ఉక్కు చేతుల్లో' (రచయిత బొడ్డు కూర్మారావు) చదివితే మనసు ద్రవిస్తుంది. 75 ఏళ్ళు స్వాతంత్ర్యం తరువాత కూడా దేశం ఇంకా ఇలానే ఉండటం ఏమిటని ప్రశ్నించాలని పించుతుంది.

సలీం గారిలాంటి లబ్ధ ప్రతిష్టుల గురించి ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. వీరి కథలోని ప్రభాకర్ లాంటి మంచి మనుషులు ఊరి కొక్కు దున్నా దేశం ఎంతగానో సంస్కరించబడుతుంది. వేశ్యా జీవితాలకో గమ్యం ఏర్పడుతుంది. తాటిపెండెలో రాలిన సూర్యుడు (రచయిత చందనపల్లి గోపాలరావు) మరో మంచి కథ, ఉత్తరాంధ్ర యాస భాష, పెద్ద కులాల హుంకరింపు, చిన్న కులాలు బలియైపోవటం కన్నులకు కట్టించారు. రచయిత ఒక చోట ముళ్ళ పూడి వారు "కామెడీ, సుఖాంతం కథకంటే ట్రాజెడీ, దుఃఖాంతం కథలే చదువరిని ఆకట్టుకుంటాయని చెరగని ముద్ర వేస్తాయని అంటారు. కథ చదవటం పూర్తి అయినా, తెగిన తాటికమ్మ చెట్టుకు తలక్రిందులుగా వ్రేలాడుతోన్న నూకయ్య శవం పాఠకుడి మనసులో మరో నాలుగు రోజులు వ్రేలాడుతూనే ఉంటుంది.

సహకార పద్ధతిలో మంచి కథల్ని మళ్ళీ ఓసారి పాఠకులకు గుర్తుకు తెస్తూ,వర్ధమాన రచయిత, రచయిత్రులకు తమ కథల్ని వెలుగులో చూసుకునేందుకు అవకాశమిస్తోన్న సంపాదకులు ఎన్.కె.బాబుగారికి అభినందనలు.

తొమ్మిదవ సంకలనం 90 మంది రచయితలతో తీసుకురావాలన్న సత్సంకల్పానికి జేజేలు పలుకుదాం.



**- కూర చిదంబరం**
సెల్: 8639338675

## ఊరి రొద...

కోడిపుంజుకు కూతనేర్పి
ఊరి తొలిపొద్దును నిద్రలేపి
పడుచుసూర్యునికి పాటనేర్పి
కోడెదూడలకు నడకనేర్పి
గిడుసునేలను గడుసుపిల్లనుచేసి
ఆకుపచ్చని పైటచుట్టిన
రామంజి చిన్నాయన.
ఊరిపాదాలకుచెప్పులు తొడిగి
బోసినవ్వుతో మురిసిపోయిన
మాదిగ లాలెప్పతాత.
ఈతబర్రలతో తడికెలల్లి
బీదగుడిసెలకు నీడనిచ్చి
చిరుగుల కొట్టంలో తలదాచుకున్న
ఎరికల రామకోటన్న .
చినుకు రాలిందంటేచాలు
ఆకలితోమంటతో కొలిమిని రాజేసి
పలుగు పారలకు పదునుపెట్టిన
నబిఖాన్ మామ.
గంపెడు పిల్లల గంజినీళ్ళకోసం
గొర్రుకొయ్యల్ని గుంటక నగల్ని
బాడిషతో అరగదీసి
కాలానికి బ్రతుకునేర్పిన
వడ్ల మల్లికార్జున పెద్దయ్య
చిన్నమడుగు వంకగట్టున
మురికిబట్టల్ని సవుడునీళ్ళల్లో ఉడకబెట్టి
ఊరిమైలను శుభ్రపరిచిన చాకలవ్వ

మాసిన ఊరితలల్ని నీళ్లతో తడిపి
ఆకలి కత్తెరతో అందంగా తీర్చిదిద్ది
ఏడాదికోసారి ఇచ్చే ఇనాముకోసం
ఇల్లిల్లూ తిరిగిన మంగలి నాగభూషన్న
పొంతలు కాగులు కడవలు కుండలు
నెత్తినపెట్టుకొని ఊరూర తిరుగుతూ
ఇంటింటి సుద్దుల్ని ఊరంతా పంచిన
కుమ్మర దుబ్బవ్వ
ఇప్పుడు
ఏనగరంమీద వలససూర్యుల్లై
వెలుగుతున్నారో ఏమో
ఏమురికి కాల్వలపక్కన మబ్బుపట్టిన
చంద్రుల్లై మూలుగుతున్నారో ఏమో
కానీ .
వాళ్ళను వడ్డాణంలా నడుముకు
చుట్టుకుని నవ్వుకుంటుంది నగరం
చెప్పుల్లా పాదాలకు తొడిగి
నడిచి పోతుంది నగరం
వాళ్ళులేని మాఊరు మాత్రం
బిడ్డల్ని పోగొట్టుకున్న
ముసలి తల్లిలా రోదిస్తుంది

**-రామకృష్ణ సురగౌని**
7989723820

## చెట్టు ముచ్చట్లు

చెట్టును చూడగానే ఎక్కడలేని ప్రేమ పుట్టుకొస్తుంది.
ఎండలో దారంట వెళ్తుంటే కాసేపు
చెట్టు కింద నిలబడాలనిపిస్తుంది.
టప టపా వాన చినుకులు రాలుచుంటే
చెట్టు కొమ్మల కింద చేరాలనిపిస్తుంది.
సరదాగా రహదారి వెంట నడుచుకుంటూ వెళ్తుంటే
రోజు చూసే చెట్టు నేస్తం
రా రమ్మని పిలిచినట్లుంటుంది.
చిరాకు పడిన మనసుకు
చల్లని గాలితో సేద తీర్చుతుంది.
చెట్టుపై పిట్టలు గుళ్ళు కట్టుకొని గుడ్లు పెడితే
బుజ్జి బుజ్జి పిల్లల్ని చూడాలని
అవి బయటికి వస్తుంటే వాటి కువకువలు వినాలనిపిస్తుంది.
అందమైన సంగీత శ్రావ్యంలో మనసుకు ఆనందం కలిగిస్తుంది.
పచ్చటి ఆకులు పూసిన పువ్వులు పంచే పరిమళాలు చెట్టుకు వరాలు.
చెట్టు నీడన హాయిగా సేద తీరితే ఎంత ప్రశాంతతగా ఉంటుందో!
చెట్టు కింద పిల్లల ముచ్చట్లు ఆటలు అన్నిటినీ చూసి నవ్వుకుంటూ భరిస్తుంది.
చెట్టు చాటున ప్రేమికుల కబుర్లు విని
వాళ్లకు రక్షణగా నిలబడి సాక్ష్యం చెబుతుంది.
గొడ్డలితో నరికిన తిరిగి కొత్తదనంతో
చిగురులు తొడుగుతూనే ఉంటుంది.
చెట్లు పచ్చదనంతో పెరుగుతూ పర్యావరణాన్ని కాపాడుతుంది.
అందుకే చెట్లన్నా చెట్ల నీడన్న నాకెంతో ఇష్టం.
చెట్టుకొమ్మలకు ఊయల లేసి పసిపిల్లల్ని జోలపాలి ఊపిస్తుంది.
చెట్టును చూసి మనుగడ నేర్చుకోమంటుంది.
పదిమందికి ఉపయోగపడటం
పరమార్థమని జీవిత సత్యాన్ని నేర్పుతుంది.
బ్రతికినంత కాలం బ్రతికినా చచ్చాక కూడా కట్టెను కట్టెలతో కాల్చి
జీవితం త్యాగం అనిపించుకుంటుంది.
బ్రతికితే చెట్టు లాగా బ్రతకాలి.
సచ్చిన చెట్టు లాగా చావాలి.
(జూన్ 5వ తేదీ పర్యావరణ
దినోత్సవ సందర్భంగా



**-తాటి కోల పద్మావతి.**
9441753376

## బాలల పండుగ గ్రీష్మ కాలం

పొద్దు పొద్దుగాళ్ళ
అమ్మ చెయ్యి తడమగానే
చెంగున మంచం దిగి
ఆదరాబాదరాగా
జబ్బకు బ్యాగ్ తో
బడి బండి హారన్ తో
మొదలైన చదువు యుద్ధం కు
సెల్వులొచ్చాయి..
గ్రీష్మ కాలం బాలల పండుగ
సమ్మర్ సెలవుల సందడి
కూల్ కూల్ గా
మామిడి పండ్ల రసం
నోరూరించే తియ్యదనం తో
ఇంటిల్లిపాది అల్లరే అల్లరి..
ఊట చెరువులో
మిట్ట మధ్యాహ్నం వేళ
ఈత సరదా
గల గల సాగెను ..
సమ్మర్ స్పెషల్
డాన్స్ చేస్తూ
పైలా పచ్చీసు
క్యారం బోర్డు
తొక్కుడు బిల్లటాల
మారం బీట్
దొంగా పోలీసు ల ఆటలతో
ఆనందాల గిలిగింతలు..
వెలకట్టలేని సమ్మర్ సంతోషం
బాలల అల్లరి చిందులకు
అంతులేని ఉరుకుల పరుగుల
అమ్మమ్మ నానమ్మ ల
కమ్మని వంటల రుచులే
గ్రీష్మ కాలం కు పట్టం..



**-ఎలగొండ రవి**
9848779345

## ఆకాశం

ఆకాశం
వెలవెలబోయింది
చుక్కలన్నీ పడతులై
ఇల చేరగానే.

నా చూపుల్ని
ఆవిరిచేసాను
నింగిని చేరి నీపై
స్నేహపుజల్లై కురిసే.

ఆకాశం
ఎప్పుడూ నానేస్తమే
చుక్కల ముగ్గేసి
నాకై ఎదురుచూస్తుంటుంది.

ఆశలన్నీ
ఆవిరై నింగినంటె
మళ్ళీ కృషితో
చినుకులై దోసిలి చేరె.

ఆకాశం
చిన్నబోయింది
నెలరేడు వెన్నెలతో
నారేడు మోము చేరెనని..



**-వకుళ వాసు**
9989198334

## ఆమే ఒక యుగం

ఆకాశం పుట్టటం,
భూమి స్తంభించటం,
గాలి బరువుని నింపుకోవటం
ఇవేమీ కొత్తగా అనిపించవు.
ఆమె నడిచే పాదాల వెనుక
నింగిని వ్రేలాడే తారలు
రాలిపోయి మెరవటం,
ఆ నడకను అనుసరించటం
ఇప్పుడొక సరికొత్త దినం .
ఆమె నవ్విందంటే
విరిసే పువ్వులు
ఆ పెదవుల ముందు కురుస్తాయి .
కురిసే మేఘాలు ఆమెను తాకి
శూన్యమంతా ప్రవహిస్తే
తన చేతివేళ్ళనుండి జారే చినుకులే
ఇక్కడ పచ్చదనం
ఎవరంటారు
ఈ యుగాంతం త్వరలోనని
ఆమె నవ్వినంతకాలం
నువ్వూ,నేనూ అంతా
ఆయుష్షును
నింపుకుంటూనేవుందాం !



**-గుబ్బల శ్రీనివాస్**
8906697777

## స్వీయ రక్షణ

నాకు
గరుడ వాహనం
సింహ వాహనం
పులి వాహనం
నెమలి వాహనం కావాలి.
నాకు
గండ్ర గొడ్డలి
సుదర్శన చక్రం
కోదండం
పినాకం
అంకుశం
గాండీవం
బ్రహ్మాస్త్రం కావాలి.
ఈ నేల పంట తింటూ....
ఈ మట్టి నీరు త్రాగుతూ. ..
ఈ చెట్టు గాలి పీల్చుతూ...
పంచభూతాల సాక్షిగా
దేశ హితం కోరని మూర్ఖులను
మతోన్మాద
కలుపు మొక్కలను పెకిలించి
గావుపట్టి
భూమాతకు రక్తతర్పణం చేయడానికి !
అహింసా పరమో ధర్మః !
ధర్మ హింస తదైవచ !!



**-జింటం. అశోక్**
8978532225



## విద్య

కళతో పాటు నీతిని
బోధించే విద్య ఒకటి
జ్ఞానంతో పాటు సంస్కారాన్ని
నేర్పే విద్య మరొకటి
ప్రతి విద్య మనిషి మనుగడ కాదేమో
కాని ఒక విద్య జీవిత వృత్తవ్వాలి
ఒక విద్య జీవన శైలవ్వాలి
అదే మన గెలుపు కారణమవ్వాలి
ఎదుగుదల శిఖరమవ్వాలి
అలంకార (ఆ) భరణమవ్వాలి.
మనిషి జీవితానికి ఉపయోగపడని విద్య
జీవనానికి సహాయపడని విద్య
మనం చూస్తుండగానే చేజారుతుంది
మనం చూస్తుండగానే మాయమవుతుంది

**-కోటం త్రిశూల్**
8523005678

## తెలుగు గజల్


హిమగిరులు తలమానికంగా భాసిల్లుతున్నది నాదేశం
గంగాఝరులు సలిలధారలుగా సాగుతున్నది నాదేశం.

ప్రణవనాదం వేదసారం ప్రతిధ్వనించే పావనభూమి
భవ్యమైన ఆలయాలతో వెలుగుతున్నది నాదేశం.

వాల్మీకి రామాయణసుధా వ్యాస మహాభారతగాథ
నాలుగువేదాల జ్ఞానధారతో నడుస్తున్నది నాదేశం.

విశ్వమానవ జీవితాలకు మార్గదర్శి భగవద్గీత
ప్రపంచ దేశాల మన్నన పొందుతున్నది నాదేశం.

దేహానికి యోగామృతం అందిస్తే నిత్య యవ్వనం
ప్రపంచానికి యోగామృతం పంచుతున్నది నాదేశం



**- బూర దేవానందం**
8143589789

## ఇది నిజం

జీవిత ప్రయాణంలో జతగా నడిచే అదృష్టం కావాలి.
గతించిన గతంతో ప్రయాణం వ్యర్థ వర్తమానం అవుతుంది. వరంలాంటి
వర్తమానం పురిటి నుండి పుట్టిన
ఆనందపు హరివిల్లును ఆస్వాదించాలి .
ఉందో ,లేదో తెలియని భవిష్యత్ కోసం
ఆశల ఉషస్సులో ఊయలలూగాలి.
మనస్సు నచ్చినా, నొచ్చినా చిరు జల్లైనా, జడివానైనా
వర్షించాలి నిండిన మబ్బులు నిండుకునేలా.
అపార్థాలు,అవమానాలు,అవరోధాలు
నిందలు, నిర్లక్ష్యాలు,నిర్వేదాలు
కలహాలు,కక్షలు,కార్పణ్యాలు
ఆనందాలు,ఆహ్లాదాలు,ఆటవిడుపులు,
కోరికలు,కవ్వింతలు ,కారుణ్యాల మేళవింపుతో
అడుగు వెనుక అడుగు తోడై ప్రయాణం సాగించాలి.
ఇది నిజం.... ఇదే నిజం.



**-ధూళిపాళ్ళ మాధవికిషోర్**
9949735253.

## సంతలో సరస్వతి

అక్షరాభ్యాసానికి లక్షల్లో ఆరగించి
అరకొరగా సదువు చెప్పి
"నిరుద్యోగ"పత్రాలను అప్పచెప్పి.
గురు బ్రాహ్మ గురు విష్ణని
గప్పాలు కొట్టి మరి.
శాస్త్రీయత కరువైన
పుక్కిటి పురాణాల్ని చేర్చి.
చెద పట్టిన చరిత్రను
అనువుగా సవరించి.
నూతన విద్య అంటూ
అజ్ఞాన నూతిలోకి విద్యార్థిని నెట్టేసి .
పైత్యమెక్కి ప్రవర్తించే
పలు రాజకీయ పార్టీలు
ప్రభుత్వాల బడులంటే
పురుగన్నాల మడులేనని
మరుగుదొడ్డి వ్యదలేనని
ఎద బిడ్డ పరిగెడుతూ
నీకెంతో దూరమయ్యే
తల్లీ సరస్వతీ దేవి
నీకు గుడిలోన దండమెట్టి
విద్యా వీధిలోన బేరమెట్టే
నా దేశం..



**-సంతోష్ అచ్యుత్ కుమార్**
సెల్:

## రెక్కలు

నీ లోపం లేనిదే
నిన్ను లోకువ చేయరెవ్వరూ
మానవాంశ లేనిదే
నిన్ను ప్రేమించరెవ్వరూ
ప్రేమిలేని
స్వయంకృతాపరాధం.

ఎంత చదివీ
ఎంత ఎదిగీ
ఏం లాభం?
విచక్షణ శూన్యం..
అక్షర సారం
సంస్కారం.



**-పి.శ్రీనివాస్ గౌడ్**
9949429449

# గళకలాల సేతుబంధనం



బహుముఖ ప్రజ్ఞాశాలి అడవి రాజబాబుతో నాది 'మనసులో మాట' బంధం. ప్రధానమంత్రి మనసులో మాటను ప్రజలకు తెలుగులో చేర్చే బంధం. మామధ్య ఉన్నది గళకలాల సేతుబంధనం. 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని తెలుగు లోకి తర్జుమా చేసి, మట్టి బొమ్మను రూపొందించే అనువాదకుడిని నేను. అమృత గళంతో

**ఏనాడో 'ఈనాడు'తో మొదలైన రాజబాబు ప్రయాణం 'ఆకాశవాణి'గా మారి, అసంఖ్యాక శ్రోతల అభిమా నాన్ని మూటగట్టుకుంది.**

ఆ కార్యక్రమానికి ప్రాణం పోసిన గళ భాస్కరుడు రాజబాబు. ఆయన తెలుగులో 'మన్ కీ బాత్' చదువుతుంటే ప్రధాన మంత్రే ప్రత్యక్షంగా మాట్లాడు తున్న అనుభూతి శ్రోతలకు కలిగేది. హిందీలో ప్రధానమంత్రి గారు ఎలా మాట్లాడుతారో అదే విధమైన పదాల విరుపును తెలుగులోకీ తీసుకురావడం సమర్థుల వల్లే సాధ్యం. అలాంటి ఘటికులే రాజబాబు. ప్రధానమంత్రి గారు ఏ సందర్భాల్లో గంభీరంగా మాట్లాడుతారో, ఎప్పుడు నవ్వుతూ విషయాన్ని చెప్తారో బాగా తెలుసు కున్న పరిశీలకుడాయన. కేవలం పలుకుల అనువాదాన్ని మాత్రమే నేను చేస్తే ప్రధానమంత్రి గారి గాంభీర్యాన్ని, నవ్వును కూడా తర్జుమా చేయగలిగారు రాజబాబు. ఈ కార్యక్రమం ద్వారా ఆయన శ్రోతల హృదయాలలో బలమైన ముద్రను వేయగలిగారు.

ఏనాడో 'ఈనాడు'తో మొదలైన రాజబాబు ప్రయాణం 'ఆకాశవాణి'గా మారి, అసంఖ్యాక శ్రోతల అభిమానాన్ని మూటగట్టుకుంది. ఉద్యోగ జీవితం సాఫల్య తీరాన్ని చేరిన రోజుల్లోనూ రామప్ప దేవాలయ సొబగులను శ్రోతలకు చేర్చాలన్న తపనతో చుండూరి సీత గారి 'సారంగి' శ్రవ్య నవలానాటకానికి ఆయన సరంగుగా వ్యవహరించారు.

రాజబాబులో ఎన్నో కోణాలు దర్శనమిస్తాయి. ఆకాశవాణిలో ఉద్యోగాన్నీ ప్రజాసేవకు ఉపయోగించిన ఉన్నత మనస్కుడు రాజబాబు. కోయభాషలోకి రామాయణాన్ని అనువదించినవారిని గుర్తించి, శ్రోతలకు పరిచయం చేసిన పరిశోధకుడాయన. చరిత్ర మర్చిపోయిన స్వాతంత్ర్య పోరాటయోధులను గుర్తించి, వారి అనుభవాలను పంచుకునేలా చేసిన చరిత్రకారుడాయన. అంతటితో ఆగిపోకుండా వారికి ఆర్థిక సహాయాన్ని కూడా ఆకాశవాణి ద్వారా అందజేసిన సామాజికసేవా పరాయణుడాయన. వివిధ దేవాలయాలలో జరిగే ఉత్సవాల్లో ప్రత్యక్ష వ్యాఖ్యానాన్ని అందించి, తంత్రీ రహిత ఆకాశవాణి గుండా భక్తిరసాన్ని ప్రవహింపజేసిన ఆధ్యాత్మికవేత్త ఆయన.

×××

అడవి రాజబాబు కవి, పాటల రచయిత కూడా. కరోనా లాక్ డౌన్ సమయంలో రాసిన ఈ కింది పాట పంక్తులు పాటల రచయితగా ఆయన సృజనాత్మక పటిమకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు.

**"పరుగాపు మిత్రమా!**
**పగ్గాలు పట్టుకో**
**అలసింది ప్రకృతి**
**అణువణువూ భారమై"**

ఎవరికి వారు పగ్గాలు పట్టుకోవలసిన కాలమది. దైనందిన జీవితంలోని పరుగును కొద్దికాలం నిలిపివేయవలసిన తరుణమది. ఈ పంక్తుల్లో అణువణువూ భారమై ప్రకృతి సైతం అలసిపోయిందంటారు కవిగా రాజబాబు. ప్రకృతే అలసిపోయిన కాలమొస్తే మనిషి ఒక లెక్క కాదు కదా! అందుకే మనం కూడా అడుగు బయటపెట్టకుండా విశ్రాంతి తీసుకోవాలని రాజబాబు గారు కవితాత్మకంగా చెప్పడాన్ని చూడవచ్చు.

కరోనా కాలంలో ఉపద్రవాన్ని ముందుగానే పసిగట్టి ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంది భారతదేశం. అందుకే 'భరతజాతి భాగ్యమిది' అనే పాట లో ఇలా పేర్కొంటారు రాజబాబు.

**"భరతజాతి భాగ్యమిది**
**మేలుకుంది ముందరే**
**కదలిరండి ఒక్కరై**
**కరోనాను పెకలిద్దాం"**

కరోనా సమయంలో గుంపుగా గుమికూడడం వైరస్ వ్యాప్తికి ఒక కారణం. అందుకే ఒక్కొక్కరుగానే కదలి రమ్మని పిలుపిచ్చారు కవి. సాధారణంగా గుంపుగా ఉంటేనే దేనినైనా పెకలించడం సాధ్యం. కానీ వైరస్ ను పెకలించాలంటే దూరాన్ని పాటించడమే మార్గం. ఈ విషయాన్ని నర్మగర్భంగా ఈ పంక్తుల్లో చెప్పారు కవి.

అదే కాలంలో అడవి రాజబాబు రాసిన 'క్రిమి అస్త్రం' అనే కవితలో కొన్ని పంక్తులను కింద చూడవచ్చు.

**"ఇది అగ్నిపర్వతం వెదజల్లని లావా**
**ఇది ఎడారి లేవని ఇసుక తుపాను**
**ఇది సరిహద్దులు తెలియని శత్రువులు పేల్చే ఫిరంగి గుండు**
**ఇది తీవ్రవాదులు పేల్చని మందుపాతర**
**ఇది పట్టుకుంటే వదలని క్రిమి అస్త్రం"**

లావా, ఇసుక తుపాను, ఫిరంగి గుండు, మందుపాతర చాలా ప్రమాదకరం. పట్టుకుంటే వదలని అలాంటి ప్రమాదమే కరోనాతో ఉందని కవి చెప్తున్న సందర్భమిది. ఇక్కడ కరోనాను క్రిమి అస్త్రంగా రాజబాబు పేర్కొనడాన్ని గమనించ వచ్చు. కరోనా రోజులు ఎవరైనా ఎవరినైనా పట్టుకోవడమే ప్రమాదంగా భావించిన కాలం. అలాంటి కాలంలో పట్టుకుంటే వదలకపోవడం ఇంకా ప్రమాదకరం కదా!

×××

తండ్రి అడవి శంకరరావు నుండి వారసత్వంగా సంక్రమించిన నిజాయితీ, మానవత్వం, నిక్కచ్చిగా చెప్పే తత్వం రాజబాబులో కనబడతా యి. పాఠశాల స్థాయి నుండే నాటకాల్లో నటించిన అనుభవం ఆయనకుంది. ఆ ఆసక్తి, అనుభవం ఆకాశవాణిలో కూడా కార్యక్రమ నిర్వహణకు దోహదపడ్డాయి. అలా వందలాది నాటికలు, నాటకాల్లో నటించారు. నిర్దేశకత్వ బాధ్యతలను కూడా నిర్వహించారు. వివిధ కార్యక్రమాల్లో ప్రేక్షకులతో ఆయన సంభాషణ ఆకట్టుకుంటుంది. నేరుగా వారితో సంభాషిస్తున్నట్టు ఆప్యాయం గా, ఆత్మీయతతో రేడియో మాధ్యమంలో ఆయన మాట్లాడే తీరు శ్రోతల్లో ఆయనకుండే వ్యక్తిగత అభిమానుల సంఖ్యను పెంచింది.

రాజబాబు స్నేహశీలి. వృత్తి పట్ల అంకితభావం ఉన్న వ్యాఖ్యాత. 'మన్ కీ బాత్' కార్యక్రమం వంద భాగాలు పూర్తి చేసుకున్న సందర్భంలో ఎప్పటికీ గుర్తుండిపోయేవిధంగా 2023 మే 8వ తేదీన ఒక హోటల్లో తన స్వంత ఖర్చులతో గెట్ టు గెదర్ ఏర్పాటు చేశారు రాజబాబు. 'మన్ కీ బాత్' కార్యక్రమంలో భాగస్వాములైన అందరి అభిప్రాయాలను ఆ గెట్ టుగె దర్ లో స్వీకరించారు. ఆ కార్యక్రమ తెలుగు అనువాద ప్రసారంలో పని

**వ్యాఖ్యాతగా, సమర్పకుడిగా, కార్యక్రమ నిర్వాహకుడిగా, నిర్మాతగా, కవిగా, రచయితగా, జర్నలిస్టుగా బహుముఖ ప్రతిభను నిరూపించు కున్నారు**

చేసిన అందరినీ గుర్తుపెట్టుకుని మరీ ఆహ్వానించారు. ఒక సంస్థ చేయవలసిన ఈ పని ఆయన వ్యక్తిగతంగా చేయడం నాకు ఆయనపై ఉన్న అభిమానాన్ని రెట్టింపు చేసింది.

×××

వ్యాఖ్యాతగా, సమర్పకుడిగా, కార్యక్రమ నిర్వాహకుడిగా, నిర్మాతగా, కవిగా, రచయితగా, జర్నలిస్టుగా బహుముఖ ప్రతిభను నిరూపించు కున్నారు అడవి రాజబాబు. సంగీత కార్యక్రమాలు, డాక్యుమెంటరీలు, నాటకాలు, దేవాలయాల ఉత్సవాల సందర్భాల్లో ప్రత్యక్ష ప్రసారాలు, ఓబీ కవరేజీలు.. ఇంకా ఎన్నో ఎన్నెన్నో 'రాజ'బాబు కీర్తి 'కిరీటం'లో రత్నరాశులు. ఆయన ఉద్యోగ విరమణ సందర్భంగా ప్రత్యేక సంచిక రూపకల్పన కోసం శ్రమిస్తోన్న అయినంపూడి శ్రీలక్ష్మి అభినందనీయులు. కవులకు, కళాకారులకు ఉద్యోగ జీవితం ఒక మజిలీ మాత్రమే. రాజ బాబుకు కూడా అంతే. బంధాలే తప్ప బంధనాలు లేని సువిశాల ప్రపంచం ద్వారాలు తెరిచి ఆయనకు స్వాగతం పలుకుతోంది.

*(మే 31న అడవి రాజబాబుగారు పదవీ విరమణ చేసిన సందర్భంగా..)*



**-డా॥ రాయారావు సూర్యప్రకాశ్ రావు**
9441046839

## మినీ కవితలు

**సిరి**

రైతన్నలకు
ఉరి,
దళారులకు
సిరి...

**నక్షత్రాలు**

ఉచితాలకు
తలొగ్గని వారికీ
పట్టపగలే
కనిపిస్తాయి.
చుక్కలు...

**గమనం**

అన్యాయాలు
అక్రమాలు
పురోగమనం,
శాంతి భద్రతలు
తిరోగమనం...

**ఆదాయ వ్యయాలు**

లంచగొండులకు
ఆదాయం,
సామాన్య ప్రజలకు
వ్యయం...

**-సంబరాజు రమణి**

**మద్దతు-ధర**

బడిలో ఉండాల్సిన
బాల్యం.
మడిలో ఉండాల్సిన
రైతన్న.
ఇద్దరికి
మద్దతు ధర దొరికింది
నాయకుడి ఊరేగింపులో..

**-ఎనికేపల్లి శివకుమార్**



అంశం : నాయకుడు అసమర్థుడైతే

పేస్ బుక్ "అమరావతి సాహితీ మిత్రులు" గ్రూపులో డా. రావి రంగారావు 2024 నుండి నిరంతరాయంగా నిర్వహిస్తున్న వారం వారం కవితల వర్క్ షాపులు. 2025 "వారం వారం కవితల వర్క్ షాప్" 17 కు మొత్తం 25 మంది కవులు తమ కవితలు పోస్ట్ చేశారు.

10 కవితలకు ప్రశంసా పత్రాలు లభించాయి.

-సంపాదకులు

-డా॥రావి రంగారావు
9247581825

**భజన**

అట్టడుగు
ఆర్తనాదాలు
వినపడలేదు అతనికి.....
భజనపరుల పల్లకిలో
ఊరేగుతున్నాడుగా..

**తాకట్టు**

దేశాన్ని
తాకట్టు
పెడుతున్నాడు అతడు.
ఓట్లను
కొన్న ఖర్చు
రాబట్టుకోవాలిగా!

**నిదుర-మత్తు**

సింహాలు
చెల్లాచెదురయ్యాయి.
నక్కల దాడిలో...
నడిపించే నాయకుడు
మత్తుగా
నిదురోతున్నాడుగా!!!

**విభజన**

అతడు
మనుషుల మధ్య
మతాల గోడలు కట్టాడు.
కలిసి పోతే
కుర్చీ కదిలిపోతుంది
అనే భయంతో!

**భవిష్యత్తు**

అతడికి
భవిష్యత్తు
కనబడడం లేదు..
వాళ్ల నాయకుడి
కళ్ళజోడు
పెట్టుకున్నాడుగా!!!

## వచన కవితలు

**నాయకుడా? ప్రజలా?**

నాయకుడు అసమర్థుడైతే
అది ప్రజల సమర్థతకే ప్రశ్న...
కన్నీరు తెలిసినవారు
కష్టాలు చూసినవారు
కరుణకి అర్థం తెలిసినవారు
కాలం చెప్పిన నీతిని నమ్మేవాళ్ళు....
వీళ్ళు కదా నాయకులు...
నేడు
వీధి కొక రున్నారు,
వీళ్ళకి దేశాన్ని అప్పగిస్తే
అసమర్థతేగా మిగిలేది?
ఈ అసమర్థతే
నీతిని అవినీతిగా మార్చేస్తుంది
నిజాన్ని అబద్ధంగా చూపిస్తుంది
చట్టం, న్యాయం, పాలన, ప్రజాస్వామ్యం
అన్నీ.... మాయమై
రాజకీయ మొక్కటే మిగిలిపోతుంది...
నాయకుడు అసమర్థుడైతే....
రావణుడే దేవు డవుతాడు
రాముడు ఓటుకు నోటవుతాడు
కులం గుర్తింపు కార్డుగా
మనిషి మనిషికీ కంచె కడుతుంది...
స్వార్థం అమృతాన్ని కూడా
ఒళ్ళబెట్టేస్తుంది
చదువును అమ్మకానికి పెడుతుంది
ఆరోగ్యాన్ని అప్పులపాలు చేసేస్తోంది
ఉపాధిని వొద్దని,
అందరినీ బానిసలుగా చేసుకుంటుంది...
అసమర్థత రాజ్య మేలే
అర్థాకలి జీవితాల్లో
ప్రతి వేకువా ఒక అమవాస్యలా
చీకటి పూసేస్తుంది...
అపూర్వమైన సంస్కృతి
అద్భుతమైన మేధస్సు
అపారమైన ప్రకృతి
అపురూపమైన రాజ్యాంగం
ఇన్ని గొప్ప సంపదలు ఉన్న మనం
ఓటుకు అమ్ముడుపోని
డబ్బుకు లొంగిపోని
కులానికి కరిగిపోని
స్వార్థానికి బెదిరిపోని....
నాయకుడ్ని కూడా ఒకసారి నమ్మితే
సమర్థత అనే ఏమిటో తెలుస్తుంది,
నాయకుడంటే ఎవరో....
గుండెకు అర్థమైపోతుంది.

**-శ్రీఅరుణం శ్రీనివాస్**

నాయకుడు అసమర్థుడైతే
అవినీతి వేయి పడగల సర్పమై
స్వార్థ విషం విరజిమ్ముతూ
అమానుషత్వపు కోరలు విసిరేస్తూ
ఖజానాని ఆబగా కబళించేస్తుంది ...
నాయకుడు అసమర్థుడైతే
కులమతాలు ప్రజ్వరిల్లుతూ
రక్తపుటేరుల్ని ప్రవహిస్తూ
విచ్ఛిన్నశక్తుల్ని మింటి కెగేస్తూ
మానవత్వాన్ని మట్టి కరిపిస్తాయి...
నాయకుడు అసమర్థుడైతే
అలవి కాని ధరల విహారాలతో
దళారీల ఆనంద తాండవ మొకవైపు,
ఆకలి మంటల హాహాకారాలతో
పేద గుండెల ఆవేదనా తాండవ మొకవైపు...
నాయకుడు అసమర్థుడైతే
అక్రమార్జనలకు కట్టడి లేక
హుండీల బరువు పెరిగిపోతూ
అన్యాయాల ముట్టడే లేక
సత్యం, ధర్మం ఆనవాళ్లే తరిగిపోతాయి...
నాయకుడు అసమర్థుడైతే
విదేశీ శక్తులు పుంజుకుంటూ
దేశ సమగ్రతకు సవాళ్లిసురుతూ
అస్తిత్వ కుదుళ్లను తొలిచేస్తూ
భారతీయ వృక్ష మొదళ్లనే పెళ్ళగిస్తాయి...

**-మేడిశెట్టి సుభద్రా కృష్ణ**

**జాతికి మనుగడ**

సత్యం కోసం చేసే యుద్ధంలో
ముందుండి నడిపే నాయకుడు
యోధుల్లో పోరాట స్ఫూర్తిని రగిలిస్తూ.
అన్యాయం పై ఎక్కుపెట్టిన ప్రతి బాణానికి
దిశా నిర్దేశం చేస్తూ
బియ్యంలో రాళ్ళలా కోవర్టులను ఏరేస్తూ
గెలుపు నమ్మకం కల్గిస్తూ
వారి వెన్నంటి ఉంటే వారు
గెలుపు కోసం
మెరుపు రవ్వలై తలపడతారు...
పోరాట మన్నాక
అభిమన్యుడి మరణాలూ ఉంటాయి.
మహా వీరుల బలిదానాలూ ఉంటాయి.
వాటికి కుంగి పోకుండా
మనో బలంతో తలపడితేనే
గెలుపు వరిస్తుంది.
అలా కాకుండా?
ఆ నాయకుడు అసమర్థుడైతే
వలలో పడ్డ చేపల్లాగా
శత్రువు వ్యూహాలకు
యోధులు దొరికి పోతారు.
ఏమి జరిగిందో తెలుసుకునే లోపలే
నష్టం జరిగి పోతుంది...
కపటం ముందు
ధర్మం తల వంచాల్సివస్తుంది...
యుద్ధంలో గెలవడం ఎలానో
పరిపాలన లోనూ గెలవడం ముఖ్యం..
ప్రజా పాలనలో
అసమర్థులు నాయకత్వం వహిస్తే ?.
జనంలో అరాచక వాదం ప్రబలి
అధికారుల్లో అలసత్వం పెరిగి
రక్షక వర్గంలో క్రూరత్వం పెంపొంది
మంత్రుల్లో అహంకారం ఏర్పడి
పని వారిలో సోమరితనం ఎక్కువై
జాతి నిర్వీర్యం అయిపోతుంది..
చైనా రాకెట్ లా పైపైకి
దూసుకెళుతున్నా,
రష్యా ముక్కలు చెక్కలై
పరుగులో వెనుకబడ్డా,
అమెరికా ఉవ్వెత్తున ఎదిగి
ప్రపంచాన్ని శాసిస్తున్నా,
ఆసియా అంతర్యుద్ధాలతో
సతమతమవుతున్నా,
అప్పటి తరం
నాయకుల సిద్ధాంతాల వలననే కదా..
ఏ జనపదాని కయినా
ప్రజా నాయకుల సమర్థత పైనే
జాతికి మనుగడ..


**-శ్రీనివాస శాస్త్రి**

నాయకుడు అసమర్థుడైతే ..
నదుల్లో ప్రవహించే నీటిని
మత ఘర్షణల రక్తంతో ఎరుపెక్కిస్తాడు!
గాలిలో ఉండే ప్రాణ వాయువుని
కులాల కంపుతో కలుషితం చేస్తాడు!!.
నాయకుడు అసమర్థుడైతే ..
పేదోడి గుడిసెకు పెట్టిన మంటతో
పెద్దోడి భవంతిలో దీపం వెలిగిస్తాడు!
నింగికి నేలకు మధ్యనున్న దూరాన్ని
ఆర్థిక అంతరాలుగా మారుస్తాడు!!.
నాయకుడు అసమర్థుడైతే ..
అక్రమ కేసుల కొరడా ఝుళిపించి
అందరి చేత సలాం కొట్టించుకుంటాడు!
అక్రమాస్తులను పేర్చుకుంటూ పోయి
అప్పుల ఊబిలో అందరినీ ముంచుతాడు!!
నాయకుడు అసమర్థుడైతే ..
ఇంటి దొంగలకు కొమ్ము కాసి
ఖజానాను దివాలా తీయిస్తాడు!
ఇరుగుపొరుగుతో కాలు దువ్వి
ఇంటిలోనూ పోరు పెట్టేదాకా వదలడు!!.
నాయకుడు అసమర్థుడైతే ..
అరచేతిలో వైకుంఠం చూపిస్తూ
అభివృద్ధిని అటకెక్కించేస్తాడు!
పన్నుల మీద పన్నులు వడ్డించి
ప్రజల నడ్డి విరిచి మరీ నవ్వుతుంటాడు!!

**-టి. ధనుంజయ రెడ్డి,**
గుంటూరు.

నాయకుడు అసమర్థుడైతే
సస్యశ్యామల దేశం అనే పొలంలో
కలుపు మొక్కలు పెరుగుతాయి...
సత్యం ధర్మం త్యాగం అనే
మొక్కలను ఏపుగా పెరగనీయవు,
దేశం మొత్తం ఆక్రమించి
పునాదులతో సహా
మంచిని పెకలించి
మేమే రారాజుల మంటూ
విశ్వరూపం ప్రదర్శిస్తూ పాతుకు పోతాయి ...
ఇదే అద నుకొని
స్వార్థం దోపిడీ పురుగు
ప్రవేశిస్తుంది,
అన్యాయాలకు
అక్రమాలకు పాల్పడుతూ
దోపిడీలు చేస్తూ
నకనక లాడే డొక్కలను కూడా
పీలుస్తూ పీక్కు తింటుంది ..

**-సత్యవతి కరాలపాడు**




## 'సిరితలపుల శతకం' పుస్తకం ఆవిష్కరణ




పుస్తకావిష్కరణలో అతిథులు

హైదరాబాద్, జూన్ 11: వివిధ దేశాల్లో ఉన్న తెలుగువారు సాహిత్య రచనలు చేయడం అభినందనీయమని కేంద్ర మాజీ మంత్రి డా॥ సముద్రాల వేణుగోపాలచారి అన్నారు. సోమవారం రాత్రి త్యాగరాయ గానసభలో వంశీ విజ్ఞానపీఠం ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత్రి స్వాతి జంగా (సింగపూర్) రచించిన 'సిరితలపుల శతకం' ఆవిష్కరణ సభ జరిగింది. శ్రీపేరి పర్యవేక్షణలో జరిగిన ఈ సభలో వంశీ ప్రవాస భారతీయ సాహితీ పురస్కారాన్ని స్వాతి జంగాకు అందించి సత్కరించారు. ప్రముఖ రచయిత్రి డా॥కేవీ కృష్ణకుమారి పుస్తకాన్ని ఆవిష్కరించారు. వేణుగోపాలచారి ప్రసంగిస్తూ ఆవిష్కృత పుస్తకంలో పద్యాలు పఠనీయంగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, ప్రముఖ రచయిత్రి డా॥కే.వి. కృష్ణకుమారి వాణి ఉప్పల, డా॥ తెన్నేటి సుధాదేవి, శైలజ తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 15న 'జీవన సౌరభాలు' పద్య సంపుటి ఆవిష్కరణ

హైదరాబాద్, జూన్ 11:ఓలేటి పార్వతీశం పద్య కవితా సంపుటి 'జీవన సౌరభాలు' ఆవిష్కరణ సభ ఈ నెల 15న 5.30 గం॥లకు బుక్ ఫెస్టివల్ సొసైటీ మీటింగ్ హాల్, విజయవాడలో జరుగుతుంది. అధ్యక్షత గుత్తికొండ సుబ్బారావు, ఆవిష్కర్త మండలి బుద్ధప్రసాద్, పుస్తక సమీక్ష గుమ్మా సాంబశివరావు, గౌరవ అతిథి జి.వి. పూర్ణచందు. వివరాలకు సెల్: 92474 75975

## మట్టిపాటలో మనసు పరిమళం పుస్తక ఆవిష్కరణ



పుస్తకావిష్కరణలో అతిథులు..

పల్లె జీవితంలోని వెతలను ఆటవెలదిలో చిత్రిక పట్టిన మట్టిపాట శతకంపై ప్రముఖ కవయిత్రి మోదేపల్లి శీనమ్మ లోతైన విశ్లేషణ చేశారని వక్తలు కొనియాడారు. రెండు దశాబ్దాల కిందటి పల్లెల దైన్యాన్ని మూలకవి డా. ఏనుగు నరసింహారెడ్డి మట్టి పాటలో చిత్రించిన విధానాన్ని తనదైన శైలిలో రచయిత్రి చర్చించారని పుస్తకావిష్కర్త గంటా మనోహర్ రెడ్డి అన్నారు. మోదేపల్లి శీనమ్మ రచించిన "మట్టిపాటలో మనసు పరిమళం" గ్రంథావిష్కరణ సభ నగరంలో శనివారం డా. పోరెడ్డి రంగయ్య అధ్యక్షతన రామదాసు సాహితీ కళా సేవా సంస్థ ఆధ్వర్యంలో జరిగింది. ఈ గ్రంథాన్ని అంకితం స్వీకరించిన కవి, గాయకుడు వాకిటి రామిరెడ్డి రచయిత్రికి ధన్యవాదాలు తెలుపుతూ సాహిత్య గ్రంథం అంకితం స్వీకరించడం తన అదృష్టంగా పేర్కొన్నారు. సభాధ్యక్షులు పోరెడ్డి రంగయ్య గారు మాట్లాడుతూ మట్టిపాట పుస్తకం గా రాకముందు నుండి ఆ పద్యాలు తనకు తెలిసినవేనని అది క్యాసెట్ గా రావడం పుస్తకంగా రావడం ఎంత ఆనందమో కేవలం ఆ గ్రంథమే ఒక విమర్శ గ్రంథానికి ఆకరంగా మారడం కూడా గొప్ప సాహిత్య చర్చనీయాంశం అన్నా రు. ఈ కార్యక్రమంలో డా. చిల్లా రాజశేఖర్ రెడ్డి, సుప్రసిద్ధ సినీ కవి సాధనాల వెంకటస్వామి నాయుడు, డా. రాధా కుసుమ, కాటుకుట్టి రమేష్, తాళ్లూరి వెంకటకృష్ణ, భీమా శ్రీనివాసరావు, దూత రామ కోటేశ్వర రావు, ఈదుపుగంటి పద్మ, నల్లపనేని నాగేశ్వరరావు, డా. రవీంద్రబాబు అరవా, జె.వి.కుమార్ చేపూరితోపాటు మూలకవి డా. ఏనుగు నరసింహారెడ్డి కూడా పాల్గొన్నారు.తన కావ్యం మీద ఒక విమర్శ గ్రంథమే రాసినందుకు ఆనందం గా ఉందని మోదేపల్లి శీనమ్మ గారిని అభినందిస్తూ కృతజ్ఞతలు చెప్పారు.

## అలరించిన కళాకదంబం



నాటికలోని నటీనటులను సన్మానిస్తున్న అతిథులు.

సింధు కళా సంధ్య సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి త్యాగరాయ గానసభలో జరిగిన కళా కదంబం కార్యక్రమం శ్రోతలను అలరించింది. ప్రముఖ గాయకులు, నటులు రవి పర్యవేక్షణలో తొలుత తెలుగు హిందీ సినీ సంగీత, విభావరి, అనంతరం ప్రేమ రుతువు నాటిక ప్రదర్శన, చివరగా స్వల్ప నిడివిలో శాస్త్రీయ నృత్య రూపక ప్రదర్శన ఆకట్టుకునేలా జరిగాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డా॥ఓలేటి పార్వతీశం, సభాధ్యక్షత వహించిన సత్కళాభారతి నిర్వాహకులు, ప్రముఖ నటులు సత్యనారాయణలు మాట్లాడుతూ మన సమాజాన్ని ప్రతిబింబించే నాటకాలను బతికించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్, నటులు, ప్రయోక్త హనుమంతరావు, ప్రముఖ సాహితీవేత్త డా॥ సంగనభట్ల నరసయ్య, బడుగుల రామారావు, మాధవి, పూజిత, బుర్రా మోహనకృష్ణ, శివరమ్య, పద్మావతి, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 15న 'అల్లిక' కవితా సంపుటి ఆవిష్కరణ

హైదరాబాద్, జూన్ 11:చల్లపల్లి స్వరూపరాణి కవితా సంపుటి 'అల్లిక' ఆవిష్కరణ సభ జూన్ 15 సా॥ 5 గంటలకు బాలోత్సవ్ భవన్, రెండో అంతస్తు, విజయవాడలో జరుగుతుంది. వక్తలు జి. లక్ష్మీనరసయ్య, శిఖామణి, యాకూబ్, గూడూరు సీతామాలక్ష్మి, నూకతోటి రవికుమార్ షేక్ కరీముల్లా, దుప్పల రవికుమార్ తదితరులు పాల్గొంటారు.

## కారు, లారీ ఢీ.. ముగ్గురు యువకులు దుర్మరణం

హైదరాబాద్, జూన్ 11: విహార యాత్ర నిమిత్తం వెళ్లి తిరుగు ప్రయాణంలో వారు ప్రయాణిస్తున్న కారును ఎదురుగా వేగంగా వస్తున్న ట్రావెల్స్ బస్సు బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే మృతిచెందగా, మరో నలుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషాదకర ఘటన రంగారెడ్డి జిల్లా యాచారం మండలం మాల్ సమీపంలో నాగార్జున సాగర్ రహదారి గత అర్ధరాత్రి చోటు చేసుకుంది. యాచారం సీఐ నందీశ్వర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మహబూబ్ నగర్ జిల్లా కు చెందిన వాస సాయితేజ, వాస పవన్ కుమార్, రాఘవేందర్ లు హైదరాబాద్ బాలానగర్లో ఉంటూ ప్రైవేట్ సంస్థల్లో పని చేస్తున్నారు.

సాహిత్యం, సామాజిక నిర్వహిస్తున్న

## 'బుధవారం బాద్షా' పోటీ ఫలితాలు




అడ్మిన్: రమాదేవి
8985613123

నిర్వహణ:
శ్రీమతి సత్య నీలిమ

**'ఊహగా మొదలై.. ఊసుగా నిలిచిన కల"**

చూపుల గవాక్షాల్లో విరిసిన ఓ చిన్న కల, నిశ్శబ్దపు నీడల్లో ఊసులిచ్చిన ఆ కోరికల గలగల. నిదురల మాటున ఊయలాడిన ఊహాగానంగా మొదలై, అనురాగపు చెరలో అడుగులదాకా సాగిన కల.

అప్పుడది ఎవరికీ తెలియని కల? గుండె పేజీల మధ్య దాగిన మౌన పుస్తకం. తేనెబొట్టై తడిచిన ఆశల జలపాతం, కాలం తడిన గడ్డి మీద జారిన నీలి నీటి బొట్టు!

రోజులు మసకబారినా, గుండె లోకము వెలిగించిన ఆశ, నివ్వెర పడ్డ కలతల మధ్య నిలిచిన ఓ నిశ్శబ్ద దీపం. ఒక చిరునవ్వుగా మొదలై, చిరునామా అయింది జీవితానికి, తప్పుల మధ్య తడిసిన చిరునామా? నిన్నే తాకింది నిజానికి!

ఇప్పుడు ఆ కల, ఎటువైపు చూసినా నిజాల పరిమళమే! ఎడారి దాటిన విత్తనం వెన్నెల చిలికిన చిగురవుతోంది! తన నేల తడికి, తలవంచిన వృక్షంగా నిలుస్తోంది.

ఒకప్పుడు "కల" అని పిలిచినదాన్ని ఇప్పుడెవ్వరూ కలగా గుర్తించరు... ఎందుకంటే అది ఇప్పటికీ నిన్ను తాకే నిండైన నిజం అయిపోయింది!

**-మొహమ్మద్ ఇస్మాయిల్ , హైద్రాబాద్.**

**నిరీక్షణ ఫలితం.**

నిశ్శబ్దంలో మెల్లగా,
నిదురలో మెరుపులు,
కనులలో వెలుగులు,
చిన్న కల వృద్ధించింది.
ఇచ్ఛల వీధిలోన,
సాహసాల అడుగులు,
సంగీతి పాదాలతో,
దొర్లాయి ఆశల తూలికలు.
విపత్తుల వర్షంలో,
విసురుల రెక్కలు,
అయొక పక్షిగా,
ఆకాశం తాకింది.
తొలిపాదమే ధైర్యం,
రెండవది నమ్మకం,
మూడోది పరితపన,
చివరికి విజయ పుట.
కలల కాంతివీధి,
ఇప్పుడొక నిజం అయ్యింది!.

**-డా.భరద్వాజ రావినూతల**
కొత్తపట్నం

**చీకటితో పోరాటం**

ఎన్ని రాత్రులు ఒంటరిగా నిశితో సహవాసం చేసానో!
కన్నీటిని దాచిన కనురెప్పలకే తెలుసు.
ఎన్ని మాటల శిశిరాలను దాటేనో! క్షణక్షణం గాయాలతో గెలుపుకై పోరాడిన హృదయానికి తెలుసు..
అవరోధాలతో నిండి వున్న ఎన్ని మలుపులతో యుద్ధం చేసానో!
ప్రయాణించే ఆ మార్గాలకే తెలుసు.
నేడు పలకరించే గెలుపు విలువ గ్రహణమెరిగే సూర్యోదయానికే తెలుసు..
వెలుగుకై చీకటితో పోరాటమెంతో నని..
ఫలించిన కల శరత్కాల వెన్నెలై కన్నీటితో నిండిన చెక్కిళ్ళపై పన్నీటి వాన అమృతధారై కురుస్తుంది..
చిరునవ్వుని మరిచిన పెదవులపై వసంతాన్నే పూయిస్తుంది..

**-శ్రీదేవి సురేష్ కుసుమంచి**

**బడి బాట**

తినడానికి తిండి లేక...
నానా తిప్పలు పడి ....
కూలీ పనులు చేసి...
ఆ తల్లి కడుపు నింపుతుంటే....
తల్లి కష్టార్జితాన్ని తాగుడుకు
తగలెట్టే కసాయి తండ్రి ఒకవైపు...
భుజాన ఒక మాసిపోయిన సంచీ వేసుకొని...
చిరిగిన దుస్తులను ధరించి....
అపరిశుభ్రమైన పరిసరాల్లో పడిఉన్న...
ఖాళీ బాటిళ్లు.. పేపర్లకోసం...
సూర్యునితో పోటీపడుతూ ఉదయాన్నే పరుగులు పెడుతూ...
అపురూప బాల్యాన్ని కోల్పోతున్న దైన్యం మరొకవైపు....
గణగణమని బడిగంట మోగగానే..
బిరబిరమని ఉత్సాహంగా ..
పరుగులు పెడుతూ....
బడికి వెళ్ళే బాలలను చూస్తూ.....
నేను అందరిలా చదువుకోలేకపోతున్నానని...
ఆ చిన్నారి మనసు కన్నీటి సంద్రమైన వేళ.....
"నేటి బాలలే రేపటి పౌరులు"
వారే దేశ భవితకు కాంతిపుంజాలని నమ్మి...
బాలలలో దాగియున్న..
సృజనాత్మక శక్తిని వెలికి తీయాలనే సత్సంకల్పంతో...
కన్నతండ్రికి అతని బాధ్యతలు తెలిపి....
ఆ కుటుంబానికి ఆర్థిక సహకారం అందించి...
బాలుడిని 'బడిబాట' పట్టించి...
చదువుకోవాలనే కల ఫలించేలా చేసి....
బాలుడి మోములో ఆనందాన్ని నింపి....
అందరికీ ఆదర్శప్రాయంగా నిలిచిన
ఉపాధ్యాయులారా మీకు వందనం...

**-కంకటి సవిత**
జగిత్యాల

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: B. Devadas. RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com